

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఉమ్మడి వరంగల్

హన్మకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు

సోమవారం | 26 | జనవరి | 2026 | పేజీలు : 18


# పిలుస్తోంది... మహా జాతర మేడారం





- ప్రపంచం చూసే మహా జాతర మన మేడారం
- ఇది కేవలం ఒక పండుగ కాదు... గిరిజన ఆత్మగౌరవానికి నిలువెత్తు సాక్ష్యం
- మేడారంలో విగ్రహాలు ఉండవు
- గద్దెలే దేవతల నివాసాలు... వేదమంత్రాలు ఉండవు
- గిరిజన సంప్రదాయాలే పూజలు
- బెల్లం నైవేద్యం, కుంకుమ, పసుపు, వెదురు గద్దెలు
- ఇదే మేడారం జాతర ప్రత్యేకతలు
- తెలుగు రాష్ట్రాలే కాకుండా చత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా వంటి చుట్టుపక్కల రాష్ట్రాల నుండి లక్షల్లో భక్తులు హాజరు

**సూర్య బ్యూరో ఉమ్మడి వారంగల్, జనవరి 25, మేజర్ న్యూస్ సూర్య:** అడవుల్లో పుట్టిన ఒక గిరిజన మహిళ పోరాటం తరతరాల విశ్వాసం గా మారింది. రాజ్యాధికారం, దోపిడీని ఎదిరించిన సమ్మక్క త్యాగమే నేడు ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన ఆధ్యాత్మిక సమాగమంగా మారింది. అదే శ్రీ సమ్మక్క-సారలమ్మ మేడారం జాతర. ఇది కేవలం ఒక పండుగ కాదు గిరిజన ఆత్మగౌరవానికి నిలువెత్తు సాక్ష్యం. కాకతీయుల కాలం లో కోయ గిరిజన సమాజానికి చెందిన సమ్మక్క సామంతుల అన్యాయాన్ని ఎదిరించి పోరాడింది. ఆ పోరాటంలో ఆమె అడవుల్లో మిగతా 2లో..

## చిలకల గుట్ట, ట్రైబల్ మ్యూజియం

### మేడారం పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన మంత్రి సీతక్క



తాడ్వాయి జనవరి 25మేజర్ న్యూస్ సూర్య : చిలకలగుట్ట, ట్రైబల్ మ్యూజియం తో పాటు మేడారం పరిసరాలలోని భక్తులకు లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు.ఈనెల28 నుంచి 31 వరకు జరుగు మేడారం సమ్మక్క సారలమ్మ పగిడిద్దరాజు గోవిందరాజుల మిగతా 6లో..

రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా వరంగల్ జిల్లా

## కలెక్టర్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు

ఎన్నికల నిర్వహణలో ఉత్తమ కృషికి గుర్తింపు




8 లో

జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఎన్నికల పురస్కారం




8 లో

## భక్తులు మెచ్చిన ఇప్పపువ్వు లడ్డు

- మొట్టమొదటిసారిగా మేడారం జాతరలో భక్తులకు అందుబాటులో ఇప్పపువ్వు లడ్డు
- మార్కెట్ లో మంచి డిమాండ్
- మేడారం వేదికగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఇప్ప పువ్వు లడ్డులు పంపిణీ
- జనవరి 13 న మేడారం వేదికగా లడ్డు విక్రయ స్టాల్స్ ప్రారంభం

6 లో



## గ్రేడర్ రూపంలో కబలించిన మృత్యువు

- భూపాలపల్లి సింగరేణిలో ప్రమాదం
- గ్రేడర్ ఢీకొని ఎస్వీఈసీ కంపెనీ
- సూపర్వైజర్ శ్రీ హరి దుర్మరణం
- కేటీకే ఓసీపీ-2లో విషాదం..
- విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన నెల్లూరు వాసి



2 లో




4 లో

## రథసప్తమి సందర్భంగా సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు

# పిలుస్తోంది..

# మహా జాతర మేడారం



మొదటి పేజీ తరువాయి..

అంతర్ధానమైందన్న విశ్వాసమే దేవతారూప ఆరాధనకు నాంది పలికింది. సమ్మక్క కుమార్తె సారలమ్మ కుమారుడు జంపన్న కూడా తల్లి బాటలోనే ప్రజల కోసం పోరాడి వీరమరణం పొందరని గిరిజన కథనం. అందుకే మేడారంలో విగ్రహాలు ఉండవు గద్దెలే దేవతల నివాసాలు. వేదమంత్రాలు ఉండవు గిరిజన సంప్రదాయాలే పూజలు. బెల్లం నైవేద్యం, కుంకుమ –పసుపు, కోళ్ల బలి, వెదురు గద్దెలు ఇవే మేడారం జాతర ప్రత్యేకతలు. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరలో లక్షల కాదు కోట్ల మంది భక్తులు పాల్గొంటున్నారు. అడవుల్లో మొదలైన ఆరాధన నేడు దేశవ్యాప్తంగా గిరిజన సంస్కృతికి గుర్తింపుగా నిలిచింది. కేవలం తెలుగు రాష్ట్రలే కాకుండ, ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర , ఒరిస్సా వంటి చుట్టుపక్కల రాష్ట్రల నుండి లక్షల్లో భక్తులు ప్రతి రెండేండ్లకు ఇక్కడికి చేరుకొని తమ కోరికలు తీర్చమని వనదేవతలకి తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఇంతటి గొప్ప జాతర కి 1996 లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా ని కల్పించింది. ఈ సంవత్సరం జరిగే జాతర కి గతం లో ఎప్పుడు లేనంతగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 251 కోట్లు కేటాయించి మాస్టర్ ప్లాన్ ద్వారా జాతర గద్దెల ప్రాంగణాన్ని ఆధునీకరించింది. కొన్ని వందల సంవత్సరాలు మాన్ని కగా ఉండేలాల పూర్తి రాతి కట్టడాలతో ఈసారి మేడారం జాతర భక్తులకి కనువిందు చేయనుంది. రాతి కట్టడాలపై చిత్రీకరించిన ఆదివాసీ సంస్కృతికి చెందిన బొమ్మలు గిరిజన జాతి ఆచరాలకి అద్దంపడుతున్నాయి. గత జాతరకి 2 కోట్ల మంది భక్తులు రాగా ఈసారి 3 కోట్ల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు చెందిన పనులను దాదాపు 6 నెలల ముందే ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పంచాయత్ రాజ్ శాక మంత్రి సీతక్క పర్యవేక్షణ లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సారథ్యం లో ఈసారి మేడారం పనులు తుది మెరుగులు దిద్దుకుంటుంది.

## మహా జాతర పిలుస్తుంది....

జనవరి 28 వ తేదీసాయంత్రం 6 గంటలకు కన్నెపల్లి నుంచి పూజారులు సారలమ్మను, కొండాయి నుంచి గోవింద రాజు, పునుగొండ్ల నుంచి పగిడిద్ద రాజులను గద్దెపైకి తీసుకురావడంతో జాతర ప్రారంభం అవుతుందని. జనవరి 29 వ తేదీ సాయంత్రం 6 గంటలకు చిలకల గుట్ట నుంచి సమ్మక్క తల్లి గద్దెల పై రాక, జనవరి 30వ తేదీ వన దేవతలకు భక్తులు మొక్కులు, జనవరి 31 వ తేదీ సాయంత్రం 6 గంటలకు సమ్మక్క, సారలమ్మ దేవతలు, గోవింద రాజు, పగిడిద్ద రాజు వన దేవతలు వన ప్రవేశంతో జాతర ముగింపు.

## మేడారం జాతర సిద్ధమైంది ఇలా...


ప్రపంచంలోనే అతిపెద్ద ఆదివాసీ ఆధ్యాత్మిక సమాగమంగా గుర్తింపు పొందిన శ్రీ సమ్మక్క–సారలమ్మ మేడారం జాతర–2026ను విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. ఈ ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు జరిగే జాతరకు సుమారు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా ఉండటంతో, జాతర నిర్వహణను సాధారణ పండుగగా కాకుండా ఒక మహా పరిపాలనా కార్యాచరణగా రూపొందించారు. భక్తుల రాకపోకలు, భద్రత, మౌలిక వసతులు, వైద్య సేవలు, పరిశుభ్రత వంటి అంశాల్లో ఎక్కడా లోటు లేకుండా చూడాలనే లక్ష్యంతో మొత్తం 21 శాఖలను భాగస్వాములుగా చేసుకుని సమన్వయ చర్యలు కొనసాగుతున్నాయి. జాతర ప్రాంతాన్ని 8 పరిపాలనా జోన్లు, 42 సెక్టార్లుగా విభజించి ప్రతి జోన్కు జిల్లా స్థాయి అధికారిని జోనల్ అధికారిగా, ప్రతి సెక్టార్కు మండల స్థాయి అధికారిని నియమించారు. జాతర కాలంతో పాటు ముందస్తు ఏర్పాట్లు, అనంతర నిర్వహణను దృష్టిలో పెట్టుకుని మొత్తం 42,027 మంది సిబ్బందిని విధుల్లోకి దింపారు. ఇందులో జాతర ప్రధాన నాలుగు రోజుల్లోనే 30,904 మంది అధికారులు, సిబ్బంది సేవలందించనున్నారు.భారీగా భక్తులు తరలివచ్చే నేపథ్యంలో రహదారులు, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. జాతీయ రహదారులు, ఆర్అండ్బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో మొత్తం 525 రహదారి సంబంధిత సమస్యలను గుర్తించి అన్ని సమస్యలకు పరిష్కారం చూపారు. మొత్తం 49 రహదారుల్లో మరమ్మతులు, విస్తరణ పనులు చేపట్టగా, 10 కొత్త రహదారులు, 3 కొత్త కల్వర్టులు నిర్మించారు. వాహనాల నియంత్రణ కోసం ఏకదిశ, ద్విదిశ రూట్లను స్పష్టంగా గుర్తించి ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక అమలు చేస్తున్నారు. పార్కింగ్ అవసరాల కోసం మొత్తం 42 ప్రదేశాల్లో 1,418 ఎకరాల విస్తీర్ణాన్ని గుర్తించారు. ఇందులో 235 ఎకరాలు అటవీ శాఖ పరిధిలో, 1,183 ఎకరాలు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్నాయి. కొన్ని చోట్ల పంట కోత ఆలస్యం, నీటి ముంపు వంటి సమస్యలు ఎదురైనా, సంబంధిత శాఖలు రైతులతో సమన్వయం చేసుకుంటూ పార్కింగ్ ఏర్పాట్లు పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకున్నారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో జాతర పనుల కోసం రూ.202.70 కోట్ల వ్యయంతో 24 ప్రధాన పనులు చేపట్టారు. గద్దెల పునర్నిర్మాణం, నాలుగు లైన్ల రహదారుల అభివృద్ధి, ప్రధాన జంక్షన్ల సుందరీకరణ, హెలిప్యాడ్ల మరమ్మతులు వంటి కీలక పనులు ఇందులో ఉన్నాయి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా 84 పనులు చేపట్టగా, వీటి వ్యయం రూ.53.21 కోట్లుగా ఉంది. రహదారి మరమ్మతులు, క్యూ లైన్ షెడ్లు, సుందరీకరణ పనులు ఉన్నవి . గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన పార్కింగ్ అభివృద్ధి, గిరిజన మ్యూజియం మరమ్మతులు వంటి పనులు కూడా పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించడంలో మిషన్ భగీరథ కీలక పాత్ర పోషిస్తోంది. జాతర ప్రాంతంలో 517 బోర్స్ కేంద్రాలు, 47 సిస్టర్న్లు, 312 ట్యాపులు, 10 చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 5,700 మరుగుదొడ్లు, 285 టాయిలెట్ బ్లాకులు సిద్ధం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా విషయంలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడటానికి టీజీఎన్పీడీసీఎల్ విస్తృత చర్యలు చేపట్టింది. జాతర ప్రాంతంలో 911 విద్యుత్ స్థంభాలు, 196 ట్రాన్స్ఫార్మర్లు, 65.75 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మొబైల్ కమ్యూనికేషన్ కోసం 60 సెల్ టవర్లు, 33 సెల్ ఆన్ వీల్స్, 450 వీఎచ్ఎఫ్ సెట్లు ఏర్పాటు చేసి అన్ని ప్రధాన నెట్వర్క్ల ద్వారా పూర్తి కవరేజ్ కల్పించారు. రవాణా కోసం టీజీఎస్ఆర్టీసీ ఈసారి చరిత్రలోనే అతిపెద్ద ప్రణాళికను సిద్ధం చేసింది. మొత్తం 4,000 బస్సులు, 51,000 ట్రిప్పులు నడపాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఈ సారి సుమారు ఇరవై లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకునే అవకాశం ఉందని ఆధికారులు అంచనా వేస్తున్నారు. వైద్య సేవల పరంగా 5,192 మంది వైద్య సిబ్బందితో పాటు 108 అంబులెన్సులు, 40 బైక్ అంబులెన్సులు అందుబాటులో ఉంచుతున్నారు. అగ్నిమాపక భద్రత కోసం 15 ఫైర్ ఇంజిన్లు, 268 మంది ఫైర్ సిబ్బంది, జంపన్నవాగులో భద్రత కోసం 210 మంది ఈతగాళ్లు, ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలను మోహరించారు. భక్తుల సౌకర్యం, భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ సమగ్రంగా నిర్వహించేం దుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసింది. అన్ని శాఖల సమన్వయం, కాలప రిమితిలో పనుల పూర్తి లక్ష్యంతో ఈ మహా జాతరను మరోసారి ప్రపంచ స్థాయిలో ఆదర్శంగా నిలపాలనే దిశగా పాలన ముందుకు సాగుతోంది.



## మేడారం జాతర- డిజిటల్ జాతర...

భక్తుల సౌకర్యమే లక్ష్యంగా మేడారం జాతర–2026కు ఈసారి తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ టెక్నాలజీకి పెద్దపీట వేసింది. లక్షలాది కాదు కోట్లాది మంది భక్తులు తరలివచ్చే మహాజాతరలో సమాచార లోటు లేకుండా చూడాలనే ఉద్దేశంతో ఝ్ఛీ్టఛ్చఝ్ఝ్బజ్ఛీ్టఛ్చ2026 పేరుతో ప్రత్యేక మొబైల్ యాప్ను ప్రారంభించడంతో పాటు ఝ్ఛీ్టఛ్చఝ్ఝ్బజ్ఛీ్టఛ్చ2026.ఛిౌఝ అనే అధికారిక వెబ్సైట్ ని ప్రారంభించింది, అదే విధంగా ప్రత్యేకౌగా ఊ ఋఛీ్టఛ్చఝ గిజ్బిట్చఇఞ చాట్బాట్ను కూడా అందుబాటులోకి తెచ్చింది. ఈ చాట్బాట్ను వినియోగించుకోవలంటే భక్తులు 7658912300 నెంబర్ ని తమ ఫోన్ లో సేవ్ చేసి వాట్సాప్ లో ఏజీ అని టైపు చేయడం ద్వారా ఈ సేవలు వాడుకోవచ్చు, చాట్బాట్ సేవలు ఆంగ్లము , తెలుగులో అందుబాటులో ఉండేలా అధికారులు దీనిని తయారు చేశారు. మేడారం జాతర యాప్లో భక్తులకు అవసరమైన అన్ని సేవలను ఒక్క క్లిక్తో అందించేలా రూపకల్పన చేశారు. పరిసర వైద్య శిబిరాలు, 108 మరియు బైక్ అంబులెన్సుల లొకేషన్లు, మిస్సింగ్ పర్సన్స్ క్యాంపులు, టాయిలెట్లు, పార్కింగ్ ప్రదేశాలు, తాగునీటి చలివేంద్రాలు, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ వంటి కీలక సదుపాయాల వివరాలు స్పష్టంగా చూపిస్తున్నారు. దేవతల గద్దెల చలనం, ఆలయ స్థానం, ప్రధాన ల్యాండ్మార్కులు మ్యాప్ రూపంలో అందుబాటులో ఉండటంతో భక్తులు దారితప్పే పరిస్థితి లేకుండా ఏర్పాట్లు చేశారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ యాప్లో ప్రత్యేక సేఫ్టీ మాడ్యూల్ ను రూపొందించారు. అత్యవసర పరిస్థితుల్లో ఒక్క బటన్ నొక్కగానే సహాయం కోరే ఎస్ ఓ ఎస్ అలర్ట్, సంఘటనల నివేదిక, ఫిర్యాదుల నమోదు, తప్పిపోయిన వ్యక్తుల సమాచారం, మిస్సింగ్ కేసుల వివరాలు వంటి అంశాలను ఒకే చోట పొందు పరిచారు. ప్రత్యేక హెల్ప్డెస్క్ ద్వారా భక్తులకు తక్షణ మార్గనిర్దేశం అందేలా వ్యవస్థను సిద్ధం చేశారు.ఇక మేడారం 2026 వెబ్సైట్ మరియు చాట్బాట్ జాతర తేదీలు, సేవల లొకేషన్లు, రవాణా సూచనలు, అత్యవసర సహాయ వివరాలపై భక్తులు అడిగే ప్రశ్నలకు చాట్బాట్ వెంటనే సమాధానాలు ఇస్తోంది.అది అరణ్యంతో మమేకమైన దేవతా విశ్వాసం, ప్రకృతితో అనుబంధమైన ఆదివాసీ జీవన తత్వం. గుడి గోపురాల కంటే అడవులే పవిత్రమన్న భావనతో, శిల్పాల కంటే వనదేవతలే ప్రధానమన్న ఆలోచనతో మేడారం జాతర శతాబ్దాలుగా కొనసాగుతోంది.మేడారం అడవులు కోయా గిరిజన తెగకు చెందిన సాంప్రదాయ వైద్య జ్ఞానానికి అమూల్యమైన భాండాగారంలాంటివని చర్మవ్యాధుల నుంచి మధుమేహం వరకు వివిధ రుగ్మతలకు చికిత్స చేయడానికి కోయా గిరిజనులు ఉపయోగించే 96కి పైగా ఔషధ వృక్ష జాతులను ఈ అడవులు నిలయంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు .ఆదివాసీ విశ్వాసంలో అడవి నాశనం అయితే దేవతలు కోపిస్తారు అనే భావన ఉంది. ఈ నేపథ్యంలో, ప్లాస్టిక్ వంటి సహజ విరుద్ధ పదార్థాలు మేడారం పరిసరాల్లోకి రావడం ఒక అసహజ పరిణామంగా ఆదివాసీ పెద్దలు భావిస్తారు. సమ్మక్క–సారలమ్మ దేవతలు అరణ్యాల్లో నివసించే వనదేవతలు. వారి గద్దెలు కూడా అటవీ మధ్యనే ఉన్నాయి. జంపన్న వాగు, వెదురు అడవులు, మహువా (ఇప్ప) చెట్లు, సహజ నేల – ఇవే మేడారం ఆలయ నిర్మాణ శిల్పాలు. ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈసారి మేడారం జాతరను ప్లాస్టిక్ రహితంగా నిర్వహించాలన్న పిలుపు సహజంగానే రూపుదిద్దుకుంటోంది. దేవతల స్వరూపం–ప్రకృతి మధ్య ఉన్న అంతర్గత సంబంధమే ఈ మేడారం జాతరని, ఇటువంటి విలువైన మేడారం ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

# గ్రేడర్ రూపంలో కబలించిన మృత్యువు



భూపాలపల్లి, సూర్య ప్రతినిధి జనవరి 25 మేజర్ న్యూస్: గ్రేడర్ రూపంలో మృత్యువు కబలించింది. భూపాలపల్లి సింగరేణిలో జరిగిన ప్రమాదంలో గ్రేడర్ ఢీకొని ఎస్వీఈసీ కంపెనీ సూపర్వైజర్ శ్రీ హరి దుర్మరణం పాలయ్యారు. ఆదివారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. కేటీకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్–2 కీటికి ఓసిపిలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో జరిగిన ప్రమాదంలో ఎస్వీఈసీ ప్రైవేట్ కంపెనీకి చెందిన సూపర్వైజర్ శ్రీహరి మృతి చెందారు. ఉదయం శ్రీహరి గనిలో తన విధుల్లో భాగంగా పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ నడుస్తున్న ఒక గ్రేడర్ వాహనం అదుపుతప్పి శ్రీహరిని బలంగా తాకింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే కుప్పకూలిపోయారు.ప్రమాదాన్ని గమనించిన తోటి కార్మికులు, అధికారులు వెంటనే స్పందించి శ్రీహరిని ప్రాథమిక చికిత్స నిమిత్తం భూపాలపల్లిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, అప్పటికే శ్రీహరి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

మృతుడి వివరాలు.. మృతుడు శ్రీహరి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చి ప్రైవేట్ కంపెనీలో సూపర్వైజర్గా పనిచేస్తూ ప్రమాదానికి గురై మరణించడంతో తోటి కార్మికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. దీంతో ఓసీ 2 గనిలో విషాద ఛాయలు అమ్ముకున్నాయి.

# యూరియా బుకింగ్ యాప్ జనగామ జిల్లాలో విజయవంతంగా అమలు

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

జనగామ జిల్లా సూర్య ప్రతినిధి, జనవరి 25, మేజర్ న్యూస్ సూర్య: జిల్లాలో యూరియా సరఫరా వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా రైతు మిత్రంగా రూపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ జనగామ జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అగ్రోస్ రైతు సేవా కేంద్రం ను సందర్శించి, యూరియా నిల్వలు, యాప్ ద్వారా జరిగిన బుకింగ్స్, విక్రయ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ఒక్క కేంద్రం ద్వారా ఇప్పటివరకు సుమారు 5 వేల 600 యూరియా సంచులు విక్రయించి నట్లు తెలిపారు. గత వానాకాలంలో ఈ కేంద్రం ద్వారా విక్రయించిన బస్తాల కంటే దాదాపు 1,600 బస్తాలు అధికం కావడం గమనార్హమన్నారు.జిల్లాలో యూరియా బుకింగ్ యాప్ అమలుకు ముందు రోజువారీ సగటు యూరియా విక్రయాలు 3 వేల నుంచి 35 వందల బస్తాల వరకు మాత్రమే ఉండేవని, అయితే యాప్ అమలులోకి వచ్చిన తరువాత రోజుకు 6 వేల నుంచి 7 వేల బస్తాల వరకు విక్రయాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇది రైతులు యాప్ను విస్తృతంగా స్వీకరించడమే కాకుండా, అవసరానికి అనుగుణంగా, శాస్త్రీయ సిఫారసుల మేరకు యూరియాను వినియోగిస్తున్నారనే విషయాన్ని స్పష్టంగా సూచిస్తోందన్నారు. యూరియా బుకింగ్ యాప్కు జనగామ జిల్లాలో రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొంటూ ఇప్పటివరకు 53,946 మంది రైతులు యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకున్నారని, మొత్తం 62,398 బుకింగ్స్ నమోదు అయ్యాయని,యాప్ ద్వారా 2,04,848 యూరియా బస్తాలు బుక్ చేసినట్లు తెలిపారు. వీటిలో 2,01,012 యూరియా సంచులు రైతులకు విజయవంతంగా విక్రయించినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. అదేవిధంగా గత 15 రోజులుగా జిల్లాలో యూరియా నిల్వలు నిరంతరం 25 వేల బస్తాలకు పైగా ఉన్నాయని,ఇది రైతులకు ఎలాంటి కొరత లేకుండా యూరియాను అందించాలనే ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని కలెక్టర్ తెలిపారు. యాప్ ద్వారా నిల్వలు, సరఫరా, విక్రయాలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ సాధ్యమవుతూ, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరల విక్రయాలకు పూర్తిగా అడ్డుకట్ట పడిందన్నారు.రైతులకు యాప్ వినియోగంపై మరింత అవగాహన కల్పిస్తూ, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.యూరియా బుకింగ్ యాప్ అమలుతో నేల సారవంత పరిరక్షణ, ఎరువుల సమతుల్య వినియోగం, ప్రభుత్వానికి సబ్సిడీ భారం తగ్గడం వంటి బహుముఖ ప్రయోజనాలు సాధ్యమవుతున్నాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్పష్టం చేశారు. జిల్లాలోని రైతులందరూ ఈ యాప్ను తప్పనిసరిగా వినియోగించి, తమకు అవసరమైన యూరియాను సకాలంలో, సులభంగా పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





# మేడారం జాతర భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

**50 మంది స్పెషలిస్ట్ డాక్టర్లు**

**మెడికల్ ఆఫీసర్లు 150 మంది**

**స్టాఫ్ 500 మంది సిబ్బంది... 30 క్యాంపులు**

**జాతరలో 38 అంబులెన్సులు**

**40 బైక్ అంబులెన్సులు**

**ములుగు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గోపాలరావు**



తాడ్వాయి జనవరి 25మేజర్ న్యూస్ సూర్య : ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతర ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు ఈనెల 28 నుంచి 31 వరకు జరిగే మహా జాతరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన ఎమర్జెన్సీగా మేడారంలోని కల్యాణ మండపంలో ఉన్న వైద్య ఆరోగ్య కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేసినట్లు ములుగు జిల్లా వైద్యాధికారి గోపాల్ రావు తెలిపారు. ఈ జాతరలో 50 మంది స్పెషలిస్టు డాక్టర్ల సే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, 150 మంది మెడికల్ ఆఫీసర్లు 500 మంది స్టాఫ్ 30 క్యాంపులు జాతరలో ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయనున్నామని ఆయన తెలిపారు. భక్తులకు ఇలాంటి అత్యవసర పరిస్థితులలో ఎమర్జెన్సీగా అంబులెన్స్లను 38 ఏర్పాటు చేసినట్లు చేశామని. అత్యవసర పరిస్థితిలో జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన వెంబటే ప్రమాదం జరిగిన చోటుకు బైక్ కంప్లైంట్స్ ల ద్వారా వెళ్లి ప్రథమ చికిత్స నిర్వహించేందుకు బైకు అంబులెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాతరకు వచ్చే భక్తులకు ప్రమాదవశాత్తు ఏమి జరగకుండా తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని ఆయన అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సునాయాసంగా అమ్మవారిని దర్శిం చుకుని సురక్షితంగా తిరిగి వెళ్లాలని కోరారు.







## ప్రజల గొంతుకగా సూర్య నేటి దిన పత్రిక

**పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు,**

**పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ**

**సూర్య నేటి దిన పత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించిన సోదా**



పరకాల, జనవరి 25, మేజర్ న్యూస్ సూర్య: విశ్వసనీయ వార్తల వేదిక సూర్య నేటి దిన పత్రిక అని పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమ న్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ అన్నారు. ఆదివారం సూర్య నేటి దిన పత్రిక క్యాలెండర్ను సోదా రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోదా రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికి తీయడంలో సూర్య నేటి దిన పత్రిక క్రీయశీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో పత్రిక ప్రత్యేక స్థానం సాధించిం దని కొనియాడారు. డైనమిన్ పేజీలతో ఎప్పటి వార్తలు అ ప్పుడే ప్రజల కు ప్రత్యేకతను చాటుకుంటున్నదని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ధైర్యంగా వెలుగులోకి తీసుకు వస్తూ సమాజహితానికిఅంకితంగా సూర్య నేటి దిన పత్రిక పని చేస్తుందని ప్రశంసించారు. కార్యక్రమంలో సూర్య బ్యూరో చీఫ్ బి. పురుషోత్తం, మున్సిపల్ ఎన్నికల పదో వార్డు ఇంచార్జ్ జె. భరత్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు పసుల రమేష్, పంచగిరి జయమ్మ, కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు గూడెల్లి సదన్ కుమార్, దుప్పటి సాంబశివుడు, దుప్పటి సదయ్య, బొచ్చు మోహన్, గూడలి రంజిత్ కు మార్, బొచ్చు అనంత్, బొమ్మకంటి చంద్రమౌళి, పసుల రాజ్ కుమార్, గూడెల్లి రాజా రమేష్, బొచ్చు జెమిని తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పవిత్రమైంది

## ప్రతి ఓటరు తప్పనిసరిగా వినియోగించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

## జిల్లా కేంద్రంలో ఓటు అవగాహన సైకిల్ ర్యాలీ



భూపాలపల్లి, సూర్య ప్రతినిధి జనవరి 25 మేజర్ న్యూస్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైందని, అర్హత కలిగిన ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యా కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన 16వ జాతీయ ఓటరు దినోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కు ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయగలరని ఆయన తెలిపారు. యువత తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకొని ప్రతి ఎన్నికలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా కొత్తగా నమోదు అయిన ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు అందజేయడంతో పాటు, సీనియర్ సిటీజన్ ఓటర్లను శాలువాలతో సత్కరించారు. ఉత్తమ సేవలు అందించిన బిఎల్ఓలు సూపర్వైజర్లు, చేంజ్ ఆపరేటర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఓటరు అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఓటు హక్కు నమోదు, వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులచే నిర్వహించిన ఓటు అవగాహన సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, జిల్లా అధికారులు, ఎన్నికల విభాగ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# రథసప్తమి సందర్భంగా సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



కాళేశ్వరం జనవరి 25 మేజర్ న్యూస్ సూర్య:శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో రథ సప్తమిని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 10.00 గంటలకు పనకంటి ఫణీంద్ర శర్మ ఉప ప్రధానార్చకులు, వేద పారాయణ దార్, అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ సూర్యనారాయణ స్వామి వారికి ప్రత్యేక అభిషేకం,అరుణ పారాయణం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసినారు. అనంతరం పూజలో పాల్గొన్న భక్తులకు అర్చక స్వాములు తీర్థప్రసాదాలు వితరణ చేసి మహా ఆశీర్వచనం ఇచ్చినారు. ఇట్టి కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది, కాళేశ్వరం గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భూపాలపల్లి అభివృద్ధిపై బీఆర్ఎస్ దుష్ప్రచారాలు

## మున్సిపల్ ఎన్నికల్లో గుండు సున్నా ఖాయం

## అబద్ధాలతో రాజకీయ పబ్బం గడుపుతున్న బీఆర్ఎస్

## ప్రజలే బుద్ధి చెబుతారు

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

## రూ.40 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానాల ప్రారంభోత్సవం



భూపాలపల్లి సూర్య ప్రతినిధి జనవరి 25 మేజర్ న్యూస్:భూపాలపల్లి మునిసిపాలిటీ అభివృద్ధిపై కొంతమంది బీఆర్ఎస్ నేతలు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు మీకు గుండు సున్నా వేయడం ఖాయమని ఆయన ఎద్దేవా చేశారు.భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని సుభాష్ కాలనీ, రాజీవ్ నగర్ కాలనీల్లో ఎన్హెచ్ఎం నిధులు రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తాను ఎమ్మెల్యేగా ఉన్న రెండున్నరేళ్ల కాలంలో చేసిన, చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల మద్దతుతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే ఉద్దేశంతోనే నిరాధార ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.భూపాలపల్లి నియోజకవర్గంలో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనలో గణనీయమైన పురోగతి సాధించామని పేర్కొన్నారు. ఈ అభివృద్ధిని ప్రజలు ప్రత్యక్షంగా చూస్తుండటంతోనే రాజకీయ లబ్ధి కోసం కొందరు అసత్య ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు.





ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, ఆధారాల్లేని ఆరోపణలను ప్రజలు నమ్మబోరని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. భూపాలపల్లి అభివృద్ధి ప్రయాణం ఇలాగే కొనసాగుతుందని, అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని ముందంజలో నిలిపేందుకు తాను కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. అబద్ధాలను ప్రచారం చేస్తూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్న వారికి భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని 30 వార్డుల ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే హెచ్చరించారు.

మంగపేట, జనవరి 25, సూర్య(మేజర్ న్యూస్):ఆయన పేరు చెప్పగానే ప్రతీ యువకుడికి ఎక్కడ లేని అనందం. చిన్నా, పెద్ద తేడా లేకుండా... అన్న అని పిలువగానే ప్రతీ ఒక్కరి ఆపదలో అండగా నేను ఉన్నానంటూ భరోసా నిస్తున్న మంత్రి సీతక్క తనయుడు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు కుంజా సూర్య రామ్. ములుగు, పినపాక నియోజవర్గాల్లో నిత్యం తిరుగూ పార్టీ బలోపే తానికి అహర్నిశలు కష్టపడటమే కాకుండా, యువతకు తోడుగా ఉంటూ వివిధ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. యువత తప్పు దోవ పట్టకూడదని అన్ని రంగాల్లో రానించి మంచి మార్గంలో నడవాలని, ఎ సమస్య ఎదురైనా నేను మీకు తోడుగా ఉంటానని భరోసా కల్పిస్తున్నారు. అంతేకాకుండా ప్రజా సమస్యల పరిస్కారంలో తల్లికి తగ్గ, తనయుడుగా పేరు పొంది, నిత్యం ప్రజల్లో ఉంటున్నారు. అంగు, ఆర్బటం లేకుండా మంత్రి కొడుకును అనే అహం లేకుండా, సాధారణ వ్యక్తిగా ప్రజల్లో తిరుగుతున్న ఆయన యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.







**-యువతనేతగా, యూత్ లో మంచి గుర్తింపు**

యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంజా సూర్య రామ్, యూత్ లో మంచి గుర్తింపు పొందారు. యువత నిర్వహించే పలు క్రీడా కార్యక్రమంలలో పాల్గొనడమే కాకుండా, క్రీడా రంగంలో రాణించడానికి తన వంతుగా సహాయ సహకారం అందిస్తున్నారు. యువ నాయకులు పార్టీ బలోపేతంలో ముఖ్య భూమికి పోషించి యువత పవర్ ఏంటో చాటి చెప్పాలని పిలుపునిస్తున్నారు. యువ నాయకుడు, జన నాయకుడిగా పేరు పొంది, ప్రజల మధ్య ఉంటున్నాడు.

**యువతకు అండగా, ప్రజలకు తోడుగా..**

**నాయకులకు చేరువగా... కార్యకర్తలకు తోబుట్టువుగా నిత్యం వివిధ కార్యక్రమాలలో పాల్గొంటూ**

**ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ నేను ఉన్నానంటూ భరోసానిస్తూ**

**పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు కుంజా సూర్య రామ్**

# తల్లి బాటలో.... తనయుడు

**-నిత్యం ప్రజలకు తోడుగా ఉంటూ**

నిత్యం ప్రజల మధ్య ఉంటూ, ప్రజల సమస్యల పరిస్కారంకై కృషి చేస్తున్నారు. తల్లి పేరు చెప్పుకుని నడిచే కొడుకులా కాకుండా, తల్లికి తగ్గ కొడుకులగా తనకంటూ ఒక బ్రాండ్ ని సంపాదించుకుంటున్నారు. ప్రజల కోసం, నిత్యం నేను ఉంటా అని భరోసానిస్తూ, నిత్యం ప్రజల వద్దకు పరుగులు పెడుతున్నారు. కేవలం ములుగు, పినపాక నియోజకవర్గంలలో కాకుండా తెలంగాణ రాష్టంలో సైతం ఒక పేరును సంపాదించుకున్నారు. వివిధ కార్యక్రమంలతో పాటు, పలు సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్ లలో సైతం పాల్గొని గుర్తింపు పొందుతున్నారు.





**పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సూర్య**

మంత్రి సీతక్కతో పాటు తన యుడు కుంజా సూర్య రాజ్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమి స్తున్నారు. పార్టీ బలోపే తానికి, యువ జన నాయకులతో



కలిసి కార్య కర్తలకు దిశా నిర్దేశం చేస్తూ, పార్టీ ఎదు గుదలకు నిత్యం పాటుపడుతు న్నారు. పార్టీలో ఎ సమస్య వచ్చిన పరిష్కరిస్తూ పార్టీ ని కాపాడుకుంటూ ముందుకు సాగుతున్నారు.









**ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ**

-ఎక్కడ ఎవరికి ఆపద వచ్చిన నేను ఉన్నానంటూ కుంజా సూర్య రామ్ ప్రజలకు, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు భరోసానిస్తున్నారు. ములుగు, పినపాక నియోజకవర్గంలలో ఎక్కడ ఎవరు మృత్యువాత పడ్డ వెంటనే హుటాహుటిన వెళ్లి , మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించడమే కాకుండా ఆర్థిక సహాయం అందించి అండగా నిలుస్తున్నారు. సహాయం కోసం వచ్చిన వారికి, తన వంతు సహాయం అందించి తోడుగా నిలుస్తున్నారు.

# భక్తులు మెచ్చిన ఇప్పపువ్వు లడ్డు

మొట్టమొదటిసారిగా మేడారం జాతరలో

భక్తులకు అందుబాటులో ఇప్పపువ్వు లడ్డు

మార్కెట్ లో మంచి డిమాండ్

మేడారం వేదికగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో

ఇప్ప పువ్వు లడ్డులు పంపిణీ

జనవరి 13 న మేడారం వేదికగా లడ్డు విక్రయ స్టాల్స్ ప్రారంభం

ఇప్పటి వరకు రూ. 3 లక్షల వ్యాపారం

మేడారం పరిసరాలలో 10 స్టాల్స్ ఏర్పాటు

గిరిజన మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం



తాడ్వాయి జనవరి 25మేజర్ న్యూస్ సూర్య : ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర తెలంగాణ కుంభమేళా గా పేరు ప్రఖ్యాతలు కీర్తి ప్రతిష్ట పొందిన మేడారం మహా జాతరలో మొట్టమొదటిసారిగా ప్రత్యేకంగా గిరిజన మహిళ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో తయారుచేసిన అత్యంత పోషకాలు కలిగిన ఇప్పపువ్వు లడ్డు మేడారం వచ్చే భక్తులకు  అందుబాటులో ఉంది.ఇప్పపువ్వు లడ్డు తినడం ద్వారా అధిక ప్రయోజనాలు చేకూరుతాయని నిపుణులు చెప్తున్నారు. జీర్ణ క్రియ మెరుగుపడడం రోగ నిరోధక శక్తిని పెంచడం గుండె కొలెస్ట్రాల్ తగ్గించడం అధిక శక్తిని పొందడం బరువు నియంత్రణ తో పాటు డయాబెటిస్ తగ్గించడంలో ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్తున్నారు పూర్వకాలంలో ఆదివాసి గిరిజనులు ఇప్పపువ్వును అనేక వ్యాధులకు ముందుగా ఉపయోగించేవారు అని ఇప్పటికీ గుత్తి కోయ గూడాలలో వారి పిల్లలకు ఇప్పపువ్వు కుడుములు లడ్డూలు తినిపియడం ద్వారా పిల్లలు పౌష్టికంగా బలంగా ఉంటారని గిరిజనులు చెప్తున్నారు.గర్భిణీ స్త్రీలకు ఎంతో మేలు గర్భిణీ స్త్రీలు ఇప్పపువ్వు లడ్డు తినడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని కూడా చెప్తున్నారు. ఇందులో ఉండే ఫైబర్ విటమిన్లు ఖనిజాలు పోషకాలు గర్భిణీ స్త్రీలకు ఎంతగానో మేలు చేస్తుందని పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరంగా జన్మిస్తారని చెప్తున్నారు.గిరిజన మహిళలకు ఆర్థిక భరోసా గిరిజన మహిళలకు ఆర్థిక భరోసా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది దానిలో భాగంగానే ఇప్పపువ్వు లడ్డు తయారీ ద్వారా గిరిజన మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తుంది. తెలంగాణ సమగ్ర జీవనోపాధి కార్యక్రమం ద్వారా గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం ద్వారా 12 మంది గిరిజన మహిళలతో ప్రత్యేకంగా సమ్మక్క సారలమ్మ మహిళ రైతు ఉత్పత్తుల సంఘం ఏర్పాటుచేసి  వీరికి రాష్ట్ర గవర్నర్ దత్తత గ్రామం కొండపర్తి గ్రామంలో ఉట్నూర్ ఐటిడిఏ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ఇప్పపువ్వు లడ్డు తయారీ మరియు క్రయ విక్రయాల గురించి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి శిక్షణ అందించారు. తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామం లో ఇప్పపువ్వు లడ్డు తయారీ యూనిట్ ను ప్రారంభించడం జరిగింది. ఈసం మంగవేణి, ఇర్ప మంజుల , ఇర్ప మౌనిక,ఈసం సాంబలక్ష్మి, ఈసం వరలక్ష్మి వీరి ఆధ్వర్యంలో సమ్మక్క సారలమ్మ మహిళ రైతు ఉత్పత్తుల సంఘం ఏర్పాటు చేసి ఎంఎస్ఎమ్ఈ లో రిజిస్ట్రేషన్ చేసి ప్రత్యేకంగా ఫుడ్ లైసెన్స్ కూడా తీసుకోవడం జరిగింది. కన్నేపల్లి గ్రామం నుంచి చెరుప నాగమణి, గొండి అనురాధ, గొండి మాణిక్యం, గొండి స్వరూప వీరి ఆధ్వర్యంలో  సార్ వాళ్ళ అమ్మ ఫుడ్ ప్రొడకట్స్ కూడా ఫుడ్ లైసెన్స్ పొందడం జరిగింది.మేడారం మహా జాతర వేదికగా జనవరి 13వ తేదీన ఇప్పపువ్వు లడ్డు స్టాల్స్ లను స్థానిక మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించింది.ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారుగా  3 లక్షల రూపాయల వ్యాపారం జరిగిందని నిర్వాహకులు చెప్తున్నారు.ప్రారంభించిన నాటి నుంచి భక్తుల నుంచి ఇప్పపువ్వు లడ్డుకు మంచి ఆదరణ లభించడంతోపాటు మార్కెట్లో మంచి డిమాండ్ కూడా నెలకొంది. ఈనెల18వ తేదీన జరిగిన మంత్రుల క్యాబినెట్ సమావేశంలో ఇప్పపువ్వు లడ్డులను గౌరవనీయులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి,ఇతర మంత్రులతో పాటు అధికారులకు పంపిణీ చేశారు. మేడారం వచ్చే భక్తులకు  జాతర పరిసరాలలో పది స్టాల్స్ ఏర్పాటు చేశామని ఒక బాక్స్ లో 250 గ్రాములతో 150 రూపాయలకు అందుబాటులో ఉంటుందని , మాకు సహకరిస్తున్న స్థానిక మంత్రి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, డి ఆర్ డి ఏ అధికారులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . ఇప్పపువ్వు లడ్డు ద్వారా ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయని లడ్డు రుచి కూడా అమోఘంగా ఉందని గర్భిణీ స్త్రీలు ఎంతగానో ఉపయోగిస్తున్నారని కొనుగోలుదారులు చెప్తున్నారు.



# చిలుకలు గుట్ట, ట్రైబల్ మ్యూజియం

మొదటి పేజీ తరువాయి..

మహా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు.ఆదివారం  మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్ పి సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి మేడారం పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా చిలకలగుట్ట ప్రాంతాన్ని సందర్శించి అక్కడ భక్తుల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించి, అక్కడ చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మద్యం సేవించి జంపన్న వాగులోకి వెళ్లవద్దని భక్తులను సూచించారు. అలాగే మేడారం చేరుకున్న వెంటనే జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం అమ్మవార్ల దర్శనం చేసుకుని వంటావార్పు నిర్వహించుకోవాలని తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అలాగే జాతర సమయంలో చిన్నపిల్లలు, వృద్ధులను ఒంటరిగా ఎక్కడికీ వదిలివేయకూడదని మంత్రి స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులు అందరూ కలిసే ఉండాలని, ఎవరికైనా దారి తప్పితే వెంటనే సమీపంలోని పోలీసు సిబ్బందిని లేదా అధికారులను సంప్రదించాలని సూచించారు. జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు తాగు నీరు, పారిశుధ్యం, రహదారులు, దర్శన సౌకర్యాలు వంటి అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా భక్తుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అగ్రంపహాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరను విజయవంతం చేద్దాం

జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు

కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి


పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర చైర్మన్, పాలకమండలి

సభ్యుల ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా

పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి







ఆత్మకూరు, జనవరి 25, మేజర్ న్యూస్ సూర్య: అగ్రం పహాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరను విజయవంతం చేద్దామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి  పాల్గొన్నారు. అంతకముందు  జాతర పరిసర ప్రాంతాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే రేవూరి పరిశీలించారు. అనంతరం శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర  చైర్మన్ గా వంచ రంగారెడ్డి మరియు డైరెక్టర్లు, అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ జాతర పాలకవర్గం, అధికారులు సమన్వయంతో జాతరని  విజయవంతం చేయాలని కోరారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జాతర పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.భక్తుల రాకపోకలు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుద్యం, విద్యుత్ వంటి అన్ని ఏర్పాట్లు సమర్ధవంతంగా చేపట్టాలని సూచించారు. జాతరను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా జాతర ప్రాధాన్యత పెంచేలా కృషి చేద్దామని, మనందరి బాధ్యత అని అన్నారు. పాలకవర్గ సభ్యులు సేవకులా పని చేయాలని, ప్రతి ఒక్కరు టీం వర్క్ చేద్దామని అన్నారు. కార్యక్రమంలో అధికారులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేడారం భక్తులకు ఆర్టీసీ ప్రయాణం ఎంతో సురక్షితం






భూపాలపల్లి సూర్య ప్రతినిధి జనవరి 25 మేజర్ న్యూస్: మేడారం భక్తులకు ఆర్టీసీ ప్రయాణం ఎంతో సురక్షితమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**మేడారం బస్సు పాయింట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే**

సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ లో మేడారం బస్సు పాయింట్ ను ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, డిపో మేనేజర్ ఇందూ తో కలిసి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లి డిపో నుండి మొత్తం 80 సర్వీసులు మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు నడుపుతున్నట్లు తెలిపారు. మొత్తం నాలుగు పాయింట్లు భూపాలపల్లి నుండి 40 బస్సులు, సిరోంచ నుండి 20 బస్సులు, కాటారం నుండి 10 బస్సులు, కాళేశ్వరం నుండి 10 బస్సు సర్వీసులు నడుస్తున్నట్లు తెలిపారు.జాతరకు వెళ్ళే భక్తులు ఆర్టీసీ సేవలు తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు.పరకాల భూపాలపల్లి డిపోలు సంయుక్తంగా చిట్యాల, గణపురం , రేగొండలో బస్సు పాయింట్లు ఏర్పాటు చేస్తున్నాయని, మేడారం వెళ్లే భక్తులకు మహాలక్ష్మి పథకం కూడా వర్తిస్తుందని భక్తులు అమ్మవార్లను దర్శించుకుని సురక్షితంగా ఇంటికి చేరాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు.




## ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకం

**ఓటర్లు తమ ఓటు హక్కును తప్పనిసరిగా ఎన్నికల్లో వినియోగించుకోవాలి**

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**హనుమకొండ డీఈవో కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే**




హనుమకొండ, జనవరి 25 ,మేజర్ న్యూస్ సూర్య: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమైందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని హనుమకొండ అదాలత్ సర్కిల్ లోని డీఈఓ కార్యాలయం వద్ద నుండి కలెక్టరేట్ వరకు చేపట్టిన ర్యాలీని కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. ర వి, ఆర్డీవో రాథోడ్ రమేష్, తదితరుల సమక్షంలో ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, యువత, అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ హనుమకొండ కలెక్టరేట్ వరకు ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఓటు అనేది ప్రజాస్వామ్యానికి ప్రాణం వంటిదని, ప్రతి ఓటు ఎంతో విలువైనదని అన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా పట్టణాల్లోని ఓటు కలిగిన విద్యార్థులు, యువత ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవడం ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఓటు అనే ఆయుధాన్ని సరైన పద్ధతిలో వినియోగించుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలియజేస్తూ తెలంగాణ సాంస్కృతిక కళాకారులు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, కాజీపేట, హనుమకొండ తహసిల్దార్లు రాజు, రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, అధికారులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# ఘనంగా రథసప్తమి పర్వదిన వేడుకలు








నల్లబెల్లి ,జనవరి 25, మేజర్ న్యూస్ సూర్య: మండలంలోని అన్ని గ్రామాలలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి వేకువజాము నుండే శివకేశవ ఆలయాలకు భక్తులు పోటెత్తారు గ్రామాలలో రంగవల్లులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కాలనీలో మధ్యాహ్నం వేళ (చిత్రన్నం) పెరుగన్నం అనేకరకాల పళ్ళతో సూర్య భగవానునికి ప్రసాదంగా నివేదించారు అనంతరం సూర్య భగవానుని ఆకారంలో వాకిళ్లలో రంగవల్లులను తీర్చిదిద్దారు.ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని ఒకరికి ఒకరు పసుపు కుంకుమ పండ్లు వాయినంగా ఇచ్చుకున్నారు. మొత్తంగా ఆదివారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి.

## గణతంత్ర దినోత్సవ వేడుకలు

# ఘనంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




భూపాలపల్లి సూర్య ప్రతినిధి జనవరి 25 మేజర్ న్యూస్:77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై రెవెన్యూ, విద్యా, సమాచార శాఖల అధికారులతో కలెక్టర్ తన చాంబర్లో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలతో జనవరి 26, ఉదయం 9 గంటలకు జిల్లాలోని డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, అనధికారులు, ప్రజలు హాజరుకావాలని సూచించారు.గణతంత్ర దినోత్సవ వేడుకలు మినిట్ టు మినిట్ ప్రణాళిక ప్రకారం సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, డీపీఆర్వో శ్రీనివాస్, డీఈఓ రాజేందర్, కలెక్టరేట్ ఏఓ మురళీధర్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా వరంగల్ జిల్లా కలెక్టర్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు

### ఎన్నికల నిర్వహణలో ఉత్తమ కృషికి గుర్తింపు




వరంగల్ , జనవరి 25, మేజర్ న్యూస్ సూర్య: జాతీయ ఓటర్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్లోని రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్లను ఆకర్షించే విధంగా గ్రీన్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వినూత్న ఓటర్ అవగాహన కార్యక్రమాల అమలు ద్వారా ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచినందుకుగాను రాష్ట్ర స్థాయి అవార్డు వరంగల్ జిల్లాకు లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని ప్రశంసలు వెల్లువెత్తాయి. కలెక్టర్ డా. సత్య శారదకు అధికారులు, సిబ్బంది హృదయపూర్వక అభినందనలు తెలిపారు.




# ఓటు ప్రజాస్వామ్యానికి పునాది

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

### వరంగల్ ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుభుధి

### హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

హనుమకొండ, జనవరి 25, మేజర్ న్యూస్ సూర్య: ఓటు అనేది ప్రజాస్వామ్యానికి పునాది అని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుభుధి అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం నేపథ్యంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఓటు హక్కు, ఎన్నికల విధానం, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, తదితర అంశాలపై మాట్లాడిన వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. అదేవిధంగా ఎన్నికలు, ఓటు ప్రాముఖ్యత తెలియజేస్తూ దేశంలోని వివిధ భాషల్లో పాడిన గీతాల వీడియోను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముందుగా విద్యార్థులు యువత అధికారులు డీఈఓ కార్యాలయం నుండి జిల్లా కలెక్టరేట్ కు ర్యాలీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా వరంగల్ ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుభుధి హాజరై మాట్లాడుతూ ప్రపంచంలోనే మన దేశం అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని అన్నారు. ఓటు హక్కు వినియోగం తోనే దేశ నిర్మాణం జరుగుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం దేశంలోని యువత కోసం ప్రత్యేకంగా ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఎన్నికల్లో నైతిక బాధ్యతగా ఓటును వినియోగించుకునే విధంగా హక్కును కల్పిస్తుందన్నారు. దేశంలోని యువ ఓటర్లు ఓటర్లు మాత్రమే కాదని దేశ నిర్మాణంలో కీలక భాగస్వాములు అని పేర్కొన్నారు. పౌరుల భాగస్వామ్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికలలో ఓటు ను సద్వినియో గం చేసుకోవాలన్నారు. రాబోయే తరాల మనుగడ, దేశ అభివృద్ధిని నిర్ణయించేది ఓటు హక్కు అని పేర్కొన్నారు. ఓటు అనేది హక్కు మాత్రమే కాదని, అంతకుమించిన బాధ్యతగా భావించాలన్నారు. ముఖ్యంగా ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ మనదేశంలో భిన్న భాషలు, కులాలు, మతాలు, సామాజిక పరిస్థితులు ఉన్నా సరే ప్రథమంగా మనము భారతీయులం అని, అందరికీ సమానంగా ఓటు హక్కు లభించిందన్నారు. ప్రపంచ దేశాల రాజ్యాంగాలను పరిశోధించి మన దేశ రాజ్యాంగాన్ని మహనీయులు రూపొందించారని కానీ ఆశించిన స్థాయిలో ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం లేదని అన్నారు. ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. ఎలక్షన్ రోజు అనేది హాలిడే కాదు



అని బాధ్యత గల పౌరులుగా ఎన్నికల రోజున అని అన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికలలో తప్పనిసరిగా ఓటును వేయాలన్నారు. ఐదేళ్లకొకసారి వచ్చే ఎన్నికలలో ఎంతో విలువైన ఓటును డబ్బులు, ఇతర ప్రలోభాలకు లోనై దుర్వినియోగం చేసుకోవద్దని కోరారు. మన రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతుందని అన్నారు. జిల్లాలోనూ 2002 ఓటర్ల జాబితాలోని వివరాలను 2025 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఎవరైనా మ్యాపింగ్ చేయనట్లయితే ఆన్లైన్ ద్వారా స్వయంగా చేసుకునే అవకాశం ఉందని, లేకుంటే బిఎల్ఓ లను సంప్రదించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తి చేయడానికి సహకరించాలని కోరారు. ప్రక్రియ జిల్లాలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో తక్కువ శాతంగా ఉందని, పరకాల నియోజకవర్గంలో 77 శాతంగా ఉందని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో బి ఎల్ వో లు, సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు, ఈఆర్వోల సహకారంతోనే ఓటర్ల జాబితా మెరుగ్గా ఉన్నాయని అందుకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యువ ఓటర్లు, సీనియర్ ఓటర్లతో పాటు బిఎల్వో లు, బి ఎల్ వో సూపర్వైజర్లను, ఏ ఈ ఆర్ వో లు, ఈఆర్వోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శాలువాలు, ప్రశంస పత్రాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, డిటిఓ శ్రీనివాస్ కుమార్, చైల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, రెడ్ క్రాస్ రాష్ట్ర ఈసీ మెంబర్ ఇ.వి.శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.





## జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి రాష్ట్రస్థాయి ఉత్తమ ఎన్నికల పురస్కారం

### ఎన్నికల శిక్షణ, సామర్థ్య పెంపు విభాగంలో అవార్డుకు ఎంపిక

### ఎన్నికల శిక్షణ, సామర్థ్య పెంపు విభాగంలో రాష్ట్రస్థాయి లో ఉత్తమ జిల్లా పురస్కారాన్ని గవర్నర్ చేతుల మీదుగా అందుకున్న జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా షేక్




జనగామ జిల్లా సూర్యప్రతినిధి, జనవరి 25, మేజర్ న్యూస్ సూర్య: 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 2025 సంవత్సరానికిగాను ఎన్నికల నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన అధికారుల జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి శనివారం ప్రకటించారు. ఇందులో జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ 'శిక్షణ, సామర్థ్య పెంపు' (ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్) విభాగంలో అవార్డును దక్కిం చుకున్నారు. హైదరాబాద్లోని రవీంద్రభారతిలో జరిగిన రాష్ట్రస్థాయి వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర గౌరవ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పురస్కారాన్ని అందుకున్నారు. జనగామ జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం పట్ల జిల్లా అధికారులు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# టాటా ఇన్నోవేషన్ లో గోవిందరావుపేట విద్యార్థిని అద్భుత ప్రతిభ

## దృష్టిలోపం ఉన్న డ్రైవర్ల కోసం వైద్య పరిస్థితుల ఆధారంగా పనిచేసే యాప్ రూపకల్పన

## 28 రాష్ట్రాల నుండి 10247 మంది విద్యార్థులు పోటీ

## ఆల్ ఇండియాలో మొదటి స్థానం

## మూడు లక్షల ప్రైజ్ మనీ పొందిన బృందం




ములుగు, సూర్య ప్రతినిధి జనవరి 25 (మేజర్ న్యూస్): అద్భుత ప్రతిభ నీ సొంతమైతే అత్యున్నత స్థానం నీకు దాసోహం అవుతుంది. ఇందుకు ఉదాహరణగా నిలుస్తుంది గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన ఆళ్ల నిఖిత. సాక్షి విలేఖరిగా అందరికీ సుపరిచితమైన దివంగత ఆళ్ల కిషోర్ కుమార్ లక్ష్మి దంపతుల కుమార్తె అయిన ఆళ్ల నికిత హైదరాబాదులోని




సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతుంది. అయితే పూణేలో గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న టాటా ఇన్నోవేషన్ లో సి ఎం ఆర్ కాలేజ్ నుండి పూణేలో జరుగుతున్న టాటా ఇన్నోవేషన్ కు టీం లీడర్ ముకుల్ రెడ్డి సారథ్యంలో బృందం సభ్యులు పోతరాజు దీక్షిత, చిన్నాల సాయి రాఘవేంద్ర, ఆళ్ల నిఖిత, యశ్వంత్ సాయి శరత్ చంద్ర బృందంగా పూణేలో జరుగుతున్న టాటా ఇన్నోవేషన్ లో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుండి 10247 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 44 ఇంజనీరింగ్ కళాశాల నుండి 2822 వినూత్న ప్రాజెక్టులు పోటీపడ్డాయి. ఇందులో పాల్గొన్న ఆల్ ఇండియా లెవెల్ ఇంజనీరింగ్ కాలేజీలో నిఖిత సభ్యురాలుగా ఉన్న బృందానికి ఆల్ ఇండియాలో మొట్టమొదటి స్థానంలో నిలువగా మూడు లక్షల రూపాయల ప్రైజ్ మనీ దక్కించుకుంది. దృష్టిలోపం ఉన్న డ్రైవర్ల కోసం వైద్య పరిస్థితిలో ఆధారంగా పనిచేసే ఇంటలిజెంట్ వెహికల్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టం ను రూపొందించగా ఇది అందర్నీ ఆకట్టుకోవడంతోపాటు మొదటి స్థానంలో నిలిచింది. టాటా కంపెనీ సీఈఓ తో పాటు ప్రతినిధులు పాల్గొన్న ఇన్నోవేషన్ లో బృందం సభ్యులకు జాబ్ లెటర్ అందించడం గమనార్హం. ఏది ఏమైనా తల్లిదండ్రులకు పేరు తెచ్చేలా ఈ బృందం పాల్గొనడం ఆ బృందంలో సభ్యురాలు గోవిందరావుపేట మండలానికి చెందిన విద్యార్థి కావడం నిజంగా గమనార్హం.






# ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పుట్టినరోజు వేడుకలు

వెంకటాపురం నూగూరు, జనవరి 25 సూర్య మేజర్ న్యూస్ : ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో ఆదివారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పుట్టినరోజు వేడుకలను ఘనంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పరస్పరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటాపురం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిడెం మోహన్రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిడం సాంబశివరావు, వెంకటాపురం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చిట్టం సాయి, వెంకటాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ తాటి సరస్వతి, ఉపసర్పంచ్ సర్బుద్దిన్,( సన్నీ) ములుగు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మన్యం సునీల్ బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దనపనేని నాగరాజు పటేల్, డి. రవి, మురళి, జి. నాగేశ్వరావు, చిడెం ముత్తయ్య, కొండపర్తి సీతాదేవి తిప్పని సమ్మయ్య కొండపర్తి సాయి ప్రసన్న సీనియర్ నాయకులు కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు, మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొనడం జరిగింది.







# మున్సిపాలిటీ కౌన్సిలర్ అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ



## డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్

భూపాలపల్లి, టౌన్ జనవరి 25 మేజర్ న్యూస్ సూర్య: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భూపాలపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేయనున్న 150 మంది అభ్యర్థుల దరఖాస్తులను డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ స్వీకరించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశా ల తో పోటీ చేసే ప్రతి వ్యక్తి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. దరఖాస్తుల ఆధారంగా పీసీసీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సర్వేలో ముందువరుసలో నిలిచే వారు, పార్టీకి అంకితభావంతో పనిచేసే వారు, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కష్టపడి పనిచేసిన వారికే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ టికెట్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు.పార్టీ బలోపేతం లక్ష్యంగా, ప్రజల్లో నమ్మకం కలిగిన నాయకులకే అవకాశం ఇస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు విశ్వావదేవన్, జిల్లా ఉపాధ్యక్షులు పసునిటి రాజేందర్, వెంకీ యాదవ్, బుర్ర కొమురయ్య, పద్మ



సమ్మయ్య, సురేష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడినిచ్చే ఏకైక మిర్చి రకం బీసీహెచ్ 441

వాజేడు 25 మేజర్ న్యూస్ సూర్య ;మండలంలోని పెద్ద గొల్లగూడెం గ్రామంలో జగన్నాధపురం గ్రామానికి చెందిన గోపాలకృష్ణ అనే రైతు భైరవి బయోసైన్స్ కంపెనీకి చెందిన బి సి హెచ్ 441 విత్తనాన్ని సాగు చేశారు ఈ విత్తనం తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ఇచ్చే చీడపీడలకు బారిన పడకుండా ఉండే ఏకైక రకమని రైతు గోపాలకృష్ణ తెలియజేశారు ఈ విషయం తెలుసుకున్న సదరు కంపెనీ ప్రతినిధులు అతని వ్యవసాయ క్షేత్రాన్ని






పరిశీలించారు అనంతరం కొంతమంది రైతులను తీసుకొని వచ్చి ఆ విత్తనం గురించి వివరిస్తూ ఆ పంట పొలం యజమాని చేత కూడా దాని యొక్క ప్రాధాన్యతను తెలియజేశారు. భైరవి బయోసైన్స్ బి సి హెచ్ 441 విత్తనం రైతులు పంట పొలంలో వేసుకోవాలని తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వస్తుందని ఇప్పుడు వచ్చే నల్లి వంటి వాటికి తట్టుకునే ఏకైక రకం బీసిహెచ్ 441 కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు



# బాధితులకు ' ఏబిఆర్ 'టీం భరోసా

### అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయాలు... వీల్ చైర్ అందజేత



గీసుగొండ జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్య): మండలంలోని శాయం పేట గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను అల్లం బాల కిషోర్ రెడ్డి టీం పరామర్శించి ఆర్థిక సహాయం అందచేశారు. కొంపల్లి రోజారాణి కొంగర కొమ్మలు,నమిండ్ల కుమారస్వామి అనారోగ్యంతో బా ధపడుతున్న విషయం తెలుసుకున్న వెంటనే స్పందించారు.ఈ సందర్భం గా జిల్లా నాయకులు,గీసుగొండ సర్పంచ్ వీరగోని రాజకుమార్,మండల నాయకులు అల్లం మర్రెడ్డి అల్లం బాలకిషోర్ రెడ్డి తరపున బాధిత కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేలు చొప్పున మొత్తం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు.భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. అదేవిధంగా తీవ్ర అనారోగ్యంతో నడవలేని పరిస్థితిలో ఉన్న నమిండ్ల కుమారస్వామికి అవసరమైన వీల్చైర్ను అల్లం బాలకిషోర్ రెడ్డి సహకారంతో అందించారు.ఈ కార్యక్రమంలో మనుగొండ సర్పంచ్ పేర్ల శ్రవణ్,తుప్పరి వికాస్,తుప్పరి ఉదయ్,పాకనాటి మధు,దామెర నాగార్జున,రాజబోయిన రజిత,బిక్షపతి యాదవ్,ఉపసర్పంచులు బొమ్మగాని రాజు,గాలి అరుణ భాస్కర్,వార్డు సభ్యులు గాలి కళావతి వీరయ్య,తండ సరస్వతి మొగిలి,మామిడి శ్రీవిద్య రాంబాబు,సీనియర్ నాయకులు అల్లం అశోక్,మాసాని ప్రకాశ్,తాళ్లపెల్లి అనిల్, తండ మహేందర్,సముద్రాల అనిల్, తండ దిలీప్,రాజబోయిన మొగిలి,రకం అశోక్,యూత్ నాయకులు పాల్గొన్నారు.

# మాజీ ఎంఈఓ ను పరామర్శించిన పిఆర్టియు నాయకులు



మహాదేవపూర్ జనవరి 25 మేజర్ న్యూస్ సూర్య : మహాదేవపూర్ మండల మాజీ విద్యాధికారి బాల్నే ప్రకాష్ బాబు ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందిన అనంతరం హన్మకొండ లోని ఆయన స్వగృహంలో పి ఆర్ టి యు భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల శంకర్ నేత ఆధ్వర్యంలోరాష్ట్ర నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాల్నే ప్రకాష్ బాబు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మహాదేవపూర్ మండలంలో ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆశించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల ఆరోగ్యానికి సంబంధించిన ఉద్యోగుల ఆరోగ్య పథకం నిధి విధివిధానాలను సత్వరంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. మాజీ ఎంఈఓ ఎంఈఓ బాలన ప్రకాష్ బాబును కలిసిన వారిలో పి ఆర్ టి యు మండల అధ్యక్షుడు ఎల్కటి శరత్. రామచంద్ర మూర్తి,దావు రమేష్, రాజకుమార్. తదితరులు ఉన్నారు.

# ఓటుతోనే ప్రజాస్వామ్యం




### గీసుగొండ ఏపీఎం - ముక్కెర ఈశ్వర్
### మండల సమాఖ్య కార్యాలయంలో
### ఓటరు దినోత్సవం పై అవగాహన ర్యాలీ

గీసుగొండ జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్య)18 ఏళ్లు నిండిన అర్హులంతా ఓటుహక్కు వినియోగించుకుంటేనే ప్రజాస్వామ్యం మరింత ధృడపడు తుందని గీసుగొండ ఏపీఎం ముక్కెర ఈశ్వర్ పేర్కొన్నారు.జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రగతి మండల సమైక్య కార్యాలయంలో అధ్యక్షురాలు గట్టు రాధిక అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల ప్రాజెక్టు మేనేజర్ ముక్కెర ఈశ్వర్ పాల్గొని మాట్లాడారు.విధిగా,బాధ్యతతో భావించినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల ఓటు క్రియాశీలకమవుతుందని, పారదర్శకమైన ప్రజాస్వామ్యక వ్యవస్థకు మన ఓటు జవాబుదారీ కావాలని అన్నారు.18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఏపిఎం ఈశ్వర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ సురేష్, మహిళా సంఘ సభ్యులచే ఓటరు ప్రతిజ్ఞను చూపించారు.జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని మహిళా సంఘ సభ్యులు ఇందిరా మహిళా శక్తి - ఓటర్ శక్తి అనే నినాదంతో మానవహారాన్ని ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో సమైక్యఓబి సభ్యులు శారద,శిల్ప,పద్మావతి,రజిత, జయంతిక,సిఆర్పిలు కవిత, శ్రీలత పాల్గొన్నారు.

# నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

### ఓటు ఎంతో పవిత్రమైంది
### గణపురం తహసిల్దార్
### మధురకవి సత్యనారాయణ స్వామి
### మండల కేంద్రంలో ఓటు అవగాహన ర్యాలీ

గణపురం రూరల్, జనవరి 25 మేజర్ న్యూస్ సూర్య: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైందని, అర్హత కలిగిన ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గణపురం తహసిల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి అన్నారు. ఆదివారం గణపురం మండల కేంద్రంలో 16వ జాతీయ ఓట ఓటరు దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై ఓటర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ మాట్లాడుతూ ఓటు హక్కు ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయగలరని ఆయన తెలిపారు. యువత తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకొని ప్రతి ఎన్నికలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటీజన్ ఓటర్లను శాలువాలతో సత్కరించారు. ముగ్గుల పోటీలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గణపురం



సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, ఆర్ ఐ చెక్క దేవేందర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూలం కుమారస్వామి గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి చోటెమియా, ఉపసర్పంచ్ ఓరుగంటి కృష్ణ గౌడ్, మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, సీనియర్ అసిస్టెంట్ స్వామి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.








### విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షులుగా కృష్ణమాచార్యులు

భూపాలపల్లి, రూరల్ జనవరి 25, మేజర్ న్యూస్ సూర్య: జయశంకర్ భూపాలపల్లి జిల్లా విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం జిల్లా అధ్యక్షులుగా కొదురుపాక కృష్ణమాచార్యులు ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యవర్గ సమావేశానికి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కారంపూడి కృష్ణమూర్తి సిద్ధాంతి, ఇతర పెద్దలు గొల్లపల్లి రమణాచార్యులు, అత్తలూరి బాల శంకర శాస్త్రి, మంగళ నరహరి శర్మ సమక్షంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు ప్రధాన కార్యదర్శిగా బలబత్తుల రాజేశ్వర చార్యులు, కోశాధికారిగా తంగేళ్లపల్లి వెంకటేశ్వర చార్యులు, గౌరవ అధ్యక్షులుగా సదానంద చార్యులు, ముఖ్య సలహాదారులుగా కాగితపు శ్రీనివాసచార్యులు, కన్వీనర్ గా కాగితపు వెంకటాచార్యులు, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్ చార్యులు, చీర్ల వంజ రమేష్ చార్యులు, ప్రచార కార్యదర్శిగా ఐలాపురం రమణాచార్యులు, కార్యవర్గ సభ్యులుగా మియాపురం రమేష్ చార్యులు, ముప్పుడోజు లక్ష్మణాచార్యులు, చల్లూరి పవన్, శాస్త్రి సిరిమల్లె అన్వేష్ చార్యులు, తోగిటి శివచార్యులు, నూతి సాంబమూర్తి, అనసూరి రాంబాబు, సంగోజు రవీంద్ర చార్యులు, కాగితపు ముక్తేశ్వర చార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని శాలువాతో ఘనంగా సత్కరించారు. గత 20 సంవత్సరాలుగా పురోహితంలో అపార అనుభవంతో పాటు జిల్లా కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ చతురూప అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులుగా విశేష సేవలుగా అందిస్తున్న కొదురుపాక కృష్ణమాచార్యులును హాజరైన విశ్వబ్రాహ్మణ అర్చక పురోహితులు గుర్తించి ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణమాచార్యులు మాట్లాడుతూ జిల్లాలోని విశ్వబ్రాహ్మణ అర్చక పురోహితుల సంక్షేమం కోసం వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా ప్రకటించారు.

### ప్రతి విద్యుత్ స్తంభానికి వీధి దీపాలు
### వి ఆర్ కె పురం సర్పంచ్ రమ్య



వెంకటాపురం నూగూరు జనవరి 25 సూర్య మేజర్ న్యూస్: ములుగు జిల్లా వెంకటాపురం మండలం వి ఆర్ కె పురం గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ స్తంభాలకు వీధి లైట్లు లేవని గ్రామపంచాయతీ ప్రజలు సర్పంచ్ రమ్య దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన సర్పంచ్ గారు వి ఆర్ కె పురం గ్రామపంచాయతీ పరిధిలో ఏ ఒక్క విద్యుత్ స్తంభానికి కూడా విద్యుత్ దీపాలు లేకుండా ఉండకూ డదు అనే ఉద్దేశంతో సంబంధిత పంచాయతీ సెక్రటరీ రాజేంద్ర కి తెలియజేసి ప్రతి ఒక స్తంభానికి విద్యుత్ లైట్ వెలిగేటట్లు చూసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ గార మంగవేణి, పంచాయతీ సిబ్బంది బ్రహ్మం, వెంకటేష్, సతీష్,తదితరులు పాల్గొన్నారు.



# స్టువర్టుపురం దొంగలు వస్తున్నారు

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**గత ఎమ్మెల్యే తన చిల్లర చేష్టలతో నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించాడు**

**నన్ను తిట్టడానికి రాజయ్యను వాళ్ళు కూలిగా వాడుకుంటున్నారు**

**టీడీపీని కాంగ్రెస్ కు హోల్ సేల్ గా అమ్మిన నీచ చరిత్ర ఎర్రబెల్లిది**

**కేసీఆర్ చుట్టూ బొచ్చు కుక్కలా తిరిగి**

**వేల కోట్ల ఆస్తులు సంపాదించిన పల్లా**

**మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**




స్టేషన్ ఘనపూర్, జనవరి 25,మేజర్ న్యూస్ (సూర్య):ఇక్కడ ఉన్నోడే పెద్ద గజ దొంగ అంటే అతనికి తోడు మరో ముగ్గురు స్టువర్టుపురం దొంగలు వచ్చారని, ఈ దొంగలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ప్రజలకు సూచించారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పత్రికా విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. శనివారం కొంత మంది బిఆర్ఎస్ నాయకులు స్టేషన్ ఘనపూర్ మున్సిపాలి టీలో ఒక సమావేశం ఏర్పాటు చేసి ఈ నియోజకవర్గంలో కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఏమాత్రం అభివృద్ధి జరగలేదని, ఈనాడు ఇక్కడ నిర్మాణం అవుతున్న 100పడకల హాస్పిటల్ గాని, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ గాని, ఘనపూర్ మున్సిపాలిటీ కావడానికి వారే కారణం అన్న రీతిలో ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వారు మాట్లాడడం జరిగిందని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గంలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలన్నింటిని ప్రభుత్వ ఉత్తర్వులతో సహా మీడియా ద్వారా నియోజకవర్గ ప్రజల ముందు పెట్టడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఈ నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైందని తెలిసి కూడా గతంలో ఉన్న ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి మరిచిపోయి జల్సాలకు అలవాటు పడి ఈ నియోజకవర్గానికి చెడ్డ పేరు తెచ్చిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. ఇక్కడ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 100 పడకల అస్పత్రి గాని, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ గాని, ప్రస్తుతం నడుస్తున్న డిగ్రీ కాలేజ్ గాని, నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ స్కూల్ గాని, స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కావడం కానీ, దానికి 50 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు కావడం తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాతనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాత్రమే మంజూరు అయ్యాయని వెల్లడించారు. ఘనపూర్ నియోజకవర్గానికి గతంలో ఉన్న ఎమ్మెల్యే వలన ఏ రకంగా నష్టం జరిగిందో ఏ రకంగా చెడ్డ పేరు వచ్చిందో అందరికి తెలుసని అన్నారు. ప్రతిదీ కూడా అవినీతిమయం చేసి, తన చిల్లర పనుల ద్వారా ప్రజలు తలదించుకునే పరిస్థితులు తీసుకొచ్చారని ఆరోపించారు. 2023లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికలలో ఆయనకు టికెట్ రాకపోవడానికి, రాజయ్యకు టికెట్ ఇస్తే మనం గెలవమని కేసీఆర్ కి చెప్పింది అప్పటి మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఈ ముగ్గురేనని పేర్కొన్నారు.ఇక్కడ రాజయ్యను డమ్మీ చేసి ఒకరేమో బీజేపీ నాయకున్ని తీసుకురావాలని, మరొకరేమో ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ ను తీసుకురావాలని, ఇంకొకరేమో కాంగ్రెస్ నాయకున్ని తీసుకురావాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఇది రాజయ్యకు అర్థం కావడం లేదని అన్నారు.మనవరాలు వయసు ఉన్న అమ్మాయి చేతిలో ఓడిపోయేసరికి చిన్న మెదడు చితికిపోయి మతి భ్రమించి ఎర్రబెల్లి సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడుతున్నాడని ఏద్దేవా చేశారు. టిడిపిని హోల్ సేల్ గా కేసీఆర్ కు అమ్మిన నీచపు చరిత్ర నీదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారలోకి రాగానే కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళడానికి ప్రయత్నాలు చేశావ్ కానీ నీ నీచ చరిత్ర రేవంత్ రెడ్డి నిన్ను రానివ్వలేదని అన్నారు. మనం మాట్లాడే సభ్యతను బట్టే ఎదుటి వారి సంస్కారం ఉంటుందని హితవు పలికారు. కేసీఆర్ చుట్టూ బొచ్చు కుక్కలా తిరిగిన పల్లా రాజేశ్వర్ రెడ్డి కేసీఆర్ పేరు చెప్పుకొని వందల కోట్ల ఆస్తులు సంపాదించుకున్నాడని ఆరోపించారు. కవిత కేసీఆర్ చుట్టూ కొరివి దయ్యాలు ఉన్నాయని చెప్పినట్టు అందులో పెద్ద కొరివి దయ్యం పల్లా రాజేశ్వర్ రెడ్డి అని అన్నారు. కేసీఆర్ పక్కనే ఉంటూ కేసీఆర్ కుటుంబంలో చిచ్చు పెట్టడాని, పల్లా రాజేశ్వర్ రెడ్డే కేసీఆర్ కుటుంబాన్ని నాశనం చేశాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పొట్టోడు అంటున్నా దయాకరరావు చెవిటోడని అసలైన పొట్టోడు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డినే అని విమర్శించారు. కేటీఆర్, సంతోష్ రావుల బినామీ పోచంపల్లి అని అన్నారు. కేటీఆర్, సంతోష్ రావు సంపాదించిన డబ్బులని ఈయన ద్వారా రియల్ ఎస్టేట్లో ఖర్చు పెడుతున్నారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో గెలిచేందుకు ఎన్ని డబ్బులు ఖర్చు చేయడానికైనా సిద్ధంగా ఉన్నారని అన్నారు. అందుకే ఈ ముగ్గురు ఇంచార్జ్ లుగా వచ్చారని అన్నారు. అభివృద్ధి చెందుతున్న స్టేషన్ ఘనపూర్ ను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని దీనిని ప్రజలు గమనించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా మూడు సంవత్సరాలు ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వం లేకుండా అభివృద్ధి జరగదని అన్నారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని మున్సిపాలిటీ ప్రజలను విజ్ఞప్తి చేశారు. తనకు రాజకీయ జన్మనిచ్చిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తన ఎజెండా నియోజకవర్గ అభివృద్ధి మాత్రమేనని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు,సీనియర్ నాయకుడు చింతకుంట్ల నరేందర్ రెడ్డి,మార్కెట్ వైస్ చైర్మెన్ నూకల ఐలయ్య, రంగరాయగూడెం సర్పంచ్, మండలాధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, తిరుమల నాథ ఆలయ చైర్మెన్ నీల నర్సింహులు, మాజీ సర్పంచ్ పోగుల సారంగపాని, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వజ్రాయుధం



## తహసీల్దార్ కె రవి కుమార్

మల్హర్, జనవరి 25 మేజర్ న్యూస్ సూర్య : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని మల్హర్ రావు మండల తహసీల్దార్ కె రవి కుమార్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రమైన తాడిచెర్ల లో గ్రామస్తులు, యువత విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వరకు విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన ఒక పవిత్రమైన ఆయుధం అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడిచెర్ల సర్పంచ్ బండి స్వామి, జిపిఓ గొట్టం నరేష్,ఉపాధ్యాయులు, విఓఏలు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సెల్ఫోన్ మాయాజాలం.. వ్యసనంగా మారిందా..?

- దూరమౌతున్న బంధుత్వాలు కరుగుతున్న మమకారాలు
- అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య కథలు మాయం..!
- సోషల్ మీడియా వ్యసనం, యువతను మింగేస్తోందిలి
- సెల్ఫీ మోజు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువత
- అనారోగ్యం, మానసిక ఒత్తిడి



దంతాలపల్లి, జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్య): ఒకప్పుడు మనిషి జీవితం "మనుషులతో" నిండిపోయేది. ఇప్పుడు అదే జీవితం "మొబైల్ స్క్రీన్"తో నిండిపోయింది. ప్రపంచం అరచేతిలోకి వచ్చిందని ఆనందపడ్డారు, కానీ అదే అరచేతి ఇప్పుడు జీవితాన్ని బంధించే సంకెళ్లుగా మారుతోంది. సెల్ ఫోన్ అనేది అవసరం, కానీ అది అప్పుడు వ్యసనంగా మారి కుటుంబాలను చీల్చి చెదరగొడుతోంది. ఇది నిజం, కళ్ల ముందు జరుగుతున్న కఠిన వాస్తవం! సెల్ఫోన్ వ్యసనంగా మారిందా..? పిల్లలు చదవాల్సిన వయసులో, వాళ్ల చేతుల్లో పుస్తకం లేదు. ఫోన్ ఉంటుంది. యువత కలలు కట్టాల్సిన వయసులో వాళ్ల కళ్ల ముందు రీల్స్, షార్ట్ వీడియోలు, గేమ్స్ మాత్రమే తిరుగుతున్నాయి. ఒక్కసారి ఫోన్ తెరిస్తే చాలు గంటలు గడిచిపోతాయి. మళ్ళీ చూసుకుంటే కాలం పారిపోయి ఉంటుంది. కానీ జీవితం మాత్రం ముందుకు వెళ్లదు! ఇలా మొబైల్ యువతను నెమ్మదిగా లక్ష్యం లేని జీవితానికి నడిపిస్తోంది. ఇదే నిజం... దూరమౌతున్న బంధుత్వాలు... కరుగుతున్న మమకారాలుఇంట్లో అందరూ కలిసి కూర్చున్న, ప్రతి ఒక్కరి ముఖం మాత్రం ఫోన్? లోనే. ఒకప్పుడు ఇంట్లో నవ్వులు, కుటుంబంతో మాటలు, కలిసి భోజనాలు, కలిసి సరదాలు, ఇప్పుడు "ఆన్? లైన్".. "స్టేటస్"..., "లైక్స్".., "ఫాలోవర్స్" ఇలా బంధాలు బలపడాల్సిన చోట బంధాలు తెగిపోతున్నాయి..అమ్మమ్మ, నానమ్మ తాతయ్య కథలు మాయం..!ఒకప్పుడు పిల్లల్ని పెంచింది అమ్మమ్మ కథలు, తాతయ్య మాటలు, పెద్దల నీతులు. ఇప్పుడు పిల్లల్ని పెంచుతోంది ఎవరు..?యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్, గేమ్స్! నిద్రపోయే ముందు "ఒక కథ చెప్పమ్మా" అనాల్సిన పిల్లలూ, "ఫోన్ ఇవ్వండి" అంటున్నారు! ఇది కుటుంబ వ్యవస్థకే ప్రమాదం... మన సంస్కృతి మూలాలకే గండంగా మారింది.సోషల్ మీడియా వ్యసనంగా మారి యువతను మింగేస్తోంది. ఇప్పుడు యువత జీవితం ఇలా తయారైంది. "లైక్స్" కోసం బ్రతుకు, "ఫాలోవర్స్ కోసం ప్రదర్శన, "వైరల్ కోసం వెర్రితనం, రీల్స్ కోసం సమయం వృథా చేస్తున్నారు. "ఎంత చదివావు?" అని అడిగే రోజులు మారి, "ఎంత ఫాలోవర్స్ ఉన్నారు?" అనే స్థాయికి సమాజం మారిపోయింది. అక్రమ సంబంధాలకు మార్గం, సెల్ఫోన్...!సెల్ఫోన్ పరిచయాలు పెంచుతుంది. కానీ అదే పరిచయాలు కొన్నిచోట్ల కుటుంబాలను పాడుచేస్తున్నాయి. చాట్ ల పేరుతో దగ్గరయ్యే బంధాలు... సమాజంలో చివరకు అక్రమ సంబంధాలుగా మారుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. హాయ్ తో మొదలై.., ఒక్క మెసేజ్, ఒక్క కాల్, ఒక్క ఫోటో, ఇలా ఒక ఇంటి గౌరవాన్ని మట్టుబెట్టే స్థాయికి చేరుతోంది.భార్యాభర్తల మధ్య చిచ్చు, అనుమానాల పెనుబాటు ఇప్పుడు చాలా ఇళ్లలో ప్రశాంతత లేదు. కారణం మొబైల్..! ఎవరికీ కాల్..? ఎందుకు ఫోన్ లాక్..? ఈ చాట్ ఎవరిది..? ఎందుకు లేట్ రిప్లై..? ఇవి చిన్న మాటలు కాదు. ఇవి కుటుంబాన్ని చీల్చే విషపు ప్రశ్నలుగా మారి మూడుముల్ల బంధం కూడా ఇప్పుడు మొబైల్ స్క్రీన్ ముందు బలహీనమవుతోంది.సెల్ఫీ మోజు, ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువత "ఒక్క ఫోటో" కోసం యువత ప్రాణాలను పణంగా పెడుతోంది. కొండ అంచున, చెరువు గట్టున, ట్రైన్ ట్రాక్ దగ్గర, రోడ్డు మధ్యలో, సెల్ఫీ పేరుతో జల్సాలు చేస్తూ ప్రమాదాన్ని ఆహ్వానిస్తున్నారు. వైరల్ అవ్వాలనే ఆశలో జీవితం మొత్తాన్ని కోల్పోతున్నారు.అనారోగ్యం, మానసిక ఒత్తిడి : సెల్ఫోన్ ఎక్కువగా వాడటం వల్ల శరీరం, మనసు రెండూ దెబ్బతింటున్నాయి. ఇలా పెరుగుతున్నాయి సమస్యలు కళ్ల నొప్పులు, చూపు తగ్గడం, నిద్రలేమి, మెడ నొప్పి, వెన్ను నొప్పి, చిరాకు, కోపం, ఆందోళన, ఒత్తిడి, ఏకాగ్రత తగ్గడం అవి చిన్న సమస్యలు కాదు. నెమ్మదిగా జీవితాన్ని ఖాళీ చేసే వ్యాధుల బారిన పడుతున్నారు.చదువు కోసం మొబైల్ ఉపయోగించాల్సిన పిల్లలు గేమ్స్ లో మునిగిపోతున్నారు. పరీక్షలు దగ్గర ఉన్నా "ఒక్క రీల్ చూసి చదువుతా" అంటూ గంటల తరబడి సమయం వృథా చేస్తున్నారు. దీంతో చదువు పడిపోతుంది. ఫలితాలు: పడిపోతాయి. భవిష్యత్తు మసకబారుతుంది.చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు సెల్ఫోన్ స్వర్గమైంది.ఇప్పుడు పిల్లలు ఏడిస్తే బొమ్మలు కాదు... ఫోన్ ఇస్తున్నారు. పెద్దలు అలసితే విశ్రాంతి కాదు, ఫోన్ వాడుతున్నారు. యువత సమయం దొరికితే లక్ష్యం కాదూ, ఫోన్ చాటింగ్ చేస్తున్నారు. ఇలా సెల్? ఫోన్ ఒక సాధనం నుంచి మన జీవితం నడిపించే యంత్రంగా మారిపోయింది.ఇప్పుడైనా మేల్కోవాలి..! సెల్ఫోన్ అవసరమే..., కానీ దానికి బానిసత్వం ప్రమాదం. యువత భవిష్యత్తు కాపాడాలంటే...? రోజుకు స్క్రీన్ టైమ్ తగ్గించాలి. పిల్లలకు ఆటలు-పుస్తకాలు అలవాటు చేయాలి. కుటుంబంతో మాట్లాడే సమయం పెంచాలి. సోషల్ మీడియా ప్రమాదాలపై అవగాహన కల్పించాలి. సెల్ఫీ మోజు తగ్గించాలి జాగ్రత్త లేకపోతే బంధాల్ని నరకంలోకి నెట్టేస్తుంది అరచేతిలో స్వర్గం అనుకున్న మొబైల్, జాగ్రత్త లేకపోతే మన బంధాల్ని నరకంలోకి నెట్టేస్తుంది. యువత గమనించాలి. తల్లిదండ్రులు మేల్కోవాలి. సమాజం మారాలి, లేదంటే, మొబైల్ మన చేతిలో ఉండదు. మనమే మొబైల్ చేతిలో ఉంటాం..!

# జిల్లా స్థాయిలో పెద్దముప్పారం కలాన్ విద్యార్థి ప్రతిభ

## - కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న వినయ్

### - మండల విద్యాధికారి శ్రీదేవి




దంతాలపల్లి,జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్య): మండలంలోని పెద్దముప్పారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థి జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచినట్లు మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యార్థి పొన్నం వినయ్ నువినయ్ ఈ నెల 22 న నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలిచాడని,జిల్లా కేంద్రం ఐడీఓసిలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందజేశారని తెలిపారు.వ్యాస రచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి తల్లిదండ్రులకు,పాఠశాలకు పేరు తీసుకొచ్చినందుకు విద్యార్థి వినయ్ ని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలలో ప్రథమ బహుమతి గెలుచుకున్న ఆదర్శ పాఠశాల విద్యార్థి

## - కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకున్న దీక్షిత్



నెల్లికుదురు జనవరి 25 మేజర్ న్యూస్( సూర్య) జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలో నిర్వహించిన మండల స్థాయి జిల్లా స్థాయి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ శు భాకాంక్షలు తెలిపారు. ఆదివారం మహబూబాబాద్ కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ చేతిలో మీదుగా మై ఇండియా మై ఓట్ అనే అంశంపై ఉపన్యాస పోటీలు డ్రాయింగ్ పాటల పోటీలు నిర్వహించగా, గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం కలెక్టరేట్లో కలెక్టర్ చేతుల మీదుగా నెల్లికుదురు ఆదర్శ పాఠశాల 9వ తరగతి విద్యార్థి సింగరం దీక్షిత్ ఉపన్యాస పోటీలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకొని కలెక్టర్ చేతుల మీదుగా గైడ్ ఉపాధ్యాయుడు నవీన్ తో కలిసి బహుమతిని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, అనిల్ కుమార్ డీఈవో రాజేశ్వర్, విద్యార్థుల తల్లిదండ్రులు సింగరం నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బహుమతులు అందజేత



కేసముద్రం,జనవరి 25, మేజర్ న్యూస్ (సూర్య): గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని కేసముద్రం మునిసిపాలిటీ అమీనాపురంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు.అదే గ్రామానికి చెందిన మేకల అశోక్ కుమార్ విద్యార్థులకు రూ.2 వేల విలువైన బహుమతులు, జెండా సామాగ్రి అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పత్తి వీరస్వామి తెలిపారు. అశోక్ కుమార్ అందజేసిన బహుమతులను క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు నేడు అందజేయనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పత్తి వీరస్వామి తెలిపారు.ఈ సందర్భంగా అశోక్ కుమార్ కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పత్తి వీరస్వామి, ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.

# సర్పంచ్లకు ఘన సన్మానం



దంతాలపల్లి,జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్య): తెలంగాణ కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నూతన సర్పంచులను ఆదివారం ఘనంగా సన్మానించారు. పెద్దముప్పారం సర్పంచ్ కందిమల్ల భరత్ బాబు, దాట్ల సర్పంచ్ కొమ్మినేని మంజుల - రవీందర్, దంతాలపల్లి సర్పంచ్ పొన్నోటి బాలాజీలను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో తెలంగాణ కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దైద సాగర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మారపు వెంకన్న, వెంకట్రాములు,సమాఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన యువతకు కాంగ్రెస్ ధోక



మరిపెడ,జనవరి 25,మేజర్ న్యూస్(సూర్య):సీఎం ఎస్టీ ఎంటర్ ప్రేన్యూర్ షిప్ అండ్ ఇన్నోవేషన్ పథకం ఒకప్పుడు గిరిజన నిరుద్యోగ యువత పాలిటవరం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గిరిజన నిరుద్యోగులను పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్దాలనే దృఢ సంకల్పంతో తీసుకువచ్చిన మహోన్నత ఆలోచనకు రూపం సీఎం ఎస్టీఈఐ.ఏండ్ల తడబడి ప్రభుత్వ ఉద్యోగల కోసం ప్రయత్నాలు చేసి , విఫలమైన గిరిజన నిరుద్యోగ యువతకు ఈ పథకం ప్రత్యమ్నాయ జీవనోపాదిగా ఉండేది. బిఆర్ఎస్ ప్రభుత్వం 2020లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.గిరిజన నిరుద్యోగులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దింది రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని ట్రైకార్ సంస్థ గిరిజన నిరుద్యోగులకు రాత పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసేది.దేశంలోని అత్యంతమమైన బిజినెస్ ఇన్నిట్యూషన్ అయినా బెంగళూరులోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐ ఎస్ బి) లో 6 నెలలపాటు ప్రభుత్వ ఖర్చులతో ఉచిత శిక్షణ అందించేవారు.శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పరిశ్రమ ఏర్పాటు చేసుకోవడానికి కోటి రూపాయల రుణయాలు బ్యాంకుల లోన్ సౌకర్యం ద్వారా మరో 50 లక్షల రూపాయలు అప్పటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం సబ్సిడీ కింద అందించేది.ఈ నిధులతో నిరుద్యోగులు సూక్ష్మ,చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందేవారు.ఈ పథకం కింద మొదట ఏటా 100 మంది గిరిజన నిరుద్యోగులను ఎంపీగా చేసేవారు. టిఆర్ఎస్ ప్రభుత్వం 2023లో 200 మందిని ఎంపిక చేసింది.శిక్షణ పొందిన గిరిజన నిరుద్యోగ యువత పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం... కేసీఆర్ ఆనవాళ్లను తుడిచి వేయాలనే రాజకీయ కుట్రతో భాగంగా గిరిజన యువతను నిర్లక్ష్యం చేస్తుంది.గిరిజన నిరుద్యోగుల పాలిట విశిష్టత కలిగిన సీఎం ఎస్టీ ఈ పథకాన్ని పక్కన పెట్టింది రాజకీయ దురుద్దేశంతో ప్రాముఖ్యత కలిగిన పథకాన్ని కూడా నిర్లక్ష్యం చేయడం హేయమైన చర్య.గిరిజన నిరుద్యోగ యువతకు ఉపయోగపడే ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలి అని భూక్యా ప్రవీణ్ నాయక్ బి ఆర్ ఎస్ వి రాష్ట్ర నాయకులు కోరారు..

# ఘనంగా అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవ వేడుకలు



గూడూరు జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్య): మండలంలోని డాక్టర్ అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ ఏర్పాటు జరిగి 24వ తేదీ నాటికి మూడు సంవత్సరాలు ముగిసి నాలుగో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భాన శనివారం సాయంత్రం అనగా 24-1-2026 న ఈ వార్షికోత్సవ వేడుక జరుపుకోవడం జరిగింది . ఈ సందర్భంగా అధ్యక్షులు ముయ్యబోయిన వెంకన్న గారి అధ్యక్షతన వాకింగ్ గ్రౌండ్ వద్ద సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. అసోసియేషన్ కార్యవర్గంతో పాటు అసోసియేషన్ సభ్యులు పలువురు అసోసియేషన్ అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన భవిష్యత్ కార్యక్రమాల గురించి పలు సలహాలు సూచనలు చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ఏర్పాటు చేయబడినటువంటి వాకర్స్ అసోసియేషన్ సుమారు 60 మంది సభ్యులతో నిత్యం వాకింగ్ వ్యాయామాలు కొనసాగిస్తున్నది నూతన కార్యవర్గం ఏర్పాటు జరిగిన రెండు మాసాల వ్యవధిలోనే అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ గూడూరు శాఖ వాకర్స్ ఇంటర్నేషనల్ -303 లో సభ్యత్వం పొందడం పట్ల సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు. అసోసియేషన్ స్థాపించిన నాటి నుండి గడిచిన మూడు సంవత్సరాలు పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం జరగగా భవిష్యత్తులో కూడా ప్రతి నెల ఏదో ఒక చిన్నపాటి సామాజిక కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించడమైనది. అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించడానికి తాను సొంతంగా బాధ్యత తీసుకొని రిజిస్ట్రేషన్ చేయిస్తానని అధ్యక్షులు ముయ్యబోయిన వెంకన్న సభ్యుల హర్షద్వానాల మధ్య ప్రకటించారు. సమావేశానంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మచ్చిక మొగిలి గారు తేనేటి విందును ఏర్పాటు చేశారు. ఒకరికొకరు కేక్ తినిపించుకొని పరస్పరం శు భకాంక్షలు తెలుపుకొని కార్యక్రమాన్ని ముగించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముక్తవరం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మండల వెంకటేశ్వర్లు, ఊకే లక్ష్మయ్య, సహ కార్యదర్శి నునావత్ వీరన్న, ప్రచార కార్యదర్శి వాంకుడోతు గోపీనాథ్, క్రీడా కార్యదర్శి పెనుక ప్రభాకర్, కోశాధికారి బత్తుల శ్రీనివాస్, సలహాదారులు కన్న వెంకటేశ్వర్లు, సంగెపు స్వామి, అయిలబోయిన వీరయ్య, బుర్రి కొమురయ్య, బట్టు సారయ్య, గజ్జి మల్లయ్య, బెజ్జం రమేష్, మడిపెద్ది భాస్కర్, అసోసియేషన్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.



## ఉత్తమ అవార్డు అందుకున్న తహసిల్దార్

### - తహసిల్దార్ ఉప్పుల సునీల్ కుమార్ రెడ్డి




దంతాలపల్లి, జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్య): దంతాలపల్లి తహసిల్దార్ ఉప్పుల సునీల్ కుమార్ రెడ్డి ఉత్తమ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డును అందుకున్నారు.విధి నిర్వహణలో గతంలో జరిగిన ఎన్నికల నిర్వహణకు సమర్థవంతంగా ఓటర్ల జాబితాను తయారుచేసి అందించి, విధులను సక్రమంగా నిర్వహించి ప్రజల మన్నలను పొందినందుకు ఆయన సేవలను గుర్తించి,జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతీలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి డాక్టర్ సురేష్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్నారు.తహసిల్దార్ కి మండల అధికారులు, ప్రజలు,వివిధ పార్టీల నాయకులు,జర్నలిస్టులు,కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## బయ్యారం మండల వ్యవసాయ కార్యాలయం రైతు వేదికలోకి మార్పు



బయ్యారం, జనవరి 25. మేజర్ న్యూస్ సూర్య ,బయ్యారం మండల కేంద్రంలోని ఎస్బిఐ బ్యాంకు ఎదురుగా ఉన్న మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్ల ఈ పాత కార్యాలయాన్ని రికార్డులను భద్ర పరచుటకు ఉపయోగించనున్నామని, ప్రస్తుత మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని రైతు వేదికలోకి మార్చడం జరిగిందని వ్యవసాయ అధికారి కే. రాజు ఒక ప్రకటనలో తెలిపారు.కొత్త ప్రాంగణంలో సిబ్బంది, రైతులకు కూర్చునే విధంగా అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని,ఇకపై వ్యవసాయ శాఖకు సంబంధించిన అన్ని సేవలు రైతు వేదిక బయ్యారంలోనే అందించబడతాయని వారు తెలిపారు. రైతులు ఈ మార్పును గమనించి వ్యవసాయ సేవల కోసం రైతు వేదిక ను సంప్రదించాలన్నారు.ఈ మార్పు జనవరి 26,2026 నుండి అమల్లోకి వస్తుందని తెలిపారు.

## రైస్ మిల్లర్స్ జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన వేం వెంకటకృష్ణారెడ్డి




గూడూరు జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్య ):మహబూబాబాద్ జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నుకోబడి ఆదివారం రోజున పదవి బాధ్యతలు స్వీకరించిన బీఆర్ఎస్ పార్టీ గూడూరు మండల అధ్యక్షులు. వేం వెంకట కృష్ణారెడ్డి ని మండల బారాసా నాయకులు ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బానోత్ నరసింహ నాయక్ . మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు ఎండి రహీం పాషా. . బీఆర్ఎస్. మండల లీగల్ సెల్ కన్వీనర్. భూక్య సురేష్ నాయక్. సర్పంచ్. బానోత్ రమేష్ నాయక్ పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే ఆయుధం

- ఓటు హక్కు పై వ్యాస రచన పోటీలు
- గ్రామ ఉప సర్పంచ్ జెట్టి ఆజాద్ చంద్రశేఖర్



దంతాలపల్లి, జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్య): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే ఆయుధమని బీరిశెట్టిగూడెం గ్రామ ఉప సర్పంచ్ జెట్టి ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం లైబ్రరీలో పాఠశాల విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశం అని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా మంచి నాయకులను ఎన్నుకోవచ్చు అన్నారు.



# మహనీయుల పేర్లతో అవార్డులు ఇవ్వడం అభినందనీయం



హనుమకొండ టౌన్, జనవరి 25, మేజర్ న్యూస్ సూర్య, పలు రంగాలలో విశేష కృషి చేసిన వారిని గుర్తించి పురస్కారాలు ప్రధానం చేయడం అభినందనీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సెమినార్ హాల్ లో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జాతీయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం డాక్టర్ వంగాల శాంతిక్రిష్ణ ఆచార్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, సినీ కమెడియన్ ఆర్ ఎస్ నంద హాజరయ్యారు. ముందుగా నిర్వాహకులతో కలిసి ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ లాంటి మహనీయులను గుర్తు చేసుకుంటూ వారి పేరు మీద జాతీయ పురస్కారాలు ప్రధానం చేయడం మంచి పరిణామమని, ఈ సందర్భంగా నిర్వాహకులను కొనియాడారు. రాబోయే కాలంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు వంతు సహకారం సంస్థకు అందిస్తానన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని విభిన్న రంగాలలో కృషి చేస్తున్న కళాకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అవార్డులతో బాధ్యత పెరుగుతుందని, అవార్డులు అందుకుంటున్న పురస్కార గ్రహీతలు మరింత భాధ్యతగా పని చేయాలన్నారు. సినీ కమెడియన్ ఆర్ ఎస్ నంద మాట్లాడుతూ తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతుండడం గర్వ కారణమన్నారు. అతిదుల సమక్షంలో పలువురికి పురస్కారాలు ప్రధానం చేసారు. నిర్వాహకులు అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు, తెలుగు వెలుగు సాహితీ వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్ ఆచార్య, జాతీయ కార్యదర్శి డాక్టర్ వంగల మోహన్ రావు,యూత్ అధ్యక్షులు అద్దంకి నాగరాజు, నాగ మల్లేశ్వరి, అరుణ రెడ్డి, వేముల తిరుపతి రెడ్డి, బాణాల రాజు,జొనగాని యాదగిరి గౌడ్,గడ్డం వెంకన్న, తిరుణహరి నరేందర్,మానుపాటి ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూర్ సమ్మక్క- సారలమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన

భీమదేవరపల్లి, జనవరి 25(మేజర్ న్యూస్ సూర్య): ఈ నెల 28 నుంచి 31 వరకు నిర్వహించనున్న ముల్కనూర్ సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను ఖాజీపేట్ ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముల్కనూర్ సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్దకు చేరుకున్న ఏసీపీకి జాతర కమిటీ చైర్మన్ జక్కుల ఐలయ్యతో పాటు కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా చేపట్టాల్సిన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై ఏసీపీ విస్తృతంగా సమీక్షించారు. వాహనాల పార్కింగ్, భక్తుల కోసం క్యూ లైన్లు, పోలీస్ సిబ్బంది నియామకం, భక్తులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సీఐ రమేష్, ఎస్ఐ దివ్య, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, కాంగ్రెస్ నాయకులు ఆదరి రవీందర్, జక్కుల అనిల్, మాదుగుల గోపి, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో బాల్య మిత్రునికి ఆర్థిక చేయూత



పెద్దవంగర, జనవరి 25, (సూర్య న్యూస్); పెద్దవంగర మండలంలోని కొరిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి యాకయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో పదవ తరగతి బ్యాచ్ 2001 2002 చదువుకున్న బాల్య మిత్రులు ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపి 37 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఆదుకునే వారే నిజమైన స్నేహితులని, ప్రతి ఒక్కరు స్నేహ పూర్వకంగా ఉంటూ ఒకరికొకరు సహాయం చేసుకోవాలని అన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



పెద్దవంగర; జనవరి 25; (సూర్య న్యూస్); పెద్దవంగర మండల కేంద్రంలో అనపురం శ్రీనివాస్ రవి తల్లి ఎల్లమ్మ అనారోగ్యంతో మరణించగా బిఆర్ఎస్ నాయకుడు మాజీ పాలకుర్తి దేవస్థాన కమిటీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ ఎల్లమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. దంతాలపల్లి సోమయ్య అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి సానుభూతిని తెలిపి, ప్రతి కుటుంబాన్ని బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ సంజయ్, పెద్దవంగర గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు నిమ్మల విజయ శ్రీనివాస్, డైరెక్టర్ అనపురం రవి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలుక బిక్షపతి, సీనియర్ నాయకులు గద్దల వెంకన్న, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి రాంబాబు, నారాయణ, వార్డు సభ్యుడు ఏకలవ్య, మల్లేష్, యాకయ్య, చంద్రమౌళి, లక్ష్మయ్య, రాజు తదితరులు ఉన్నారు.

# ఘనంగా సర్పంచ్‌లకు సన్మానం

- తెలంగాణ కార్మిక సమాఖ్య గ్రామ కమిటీ ఎన్నిక



దంతాలపల్లి, జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్య): తెలంగాణ కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం రామానుజపురం సర్పంచ్ అక్కిరెడ్డి దామోదర్ రెడ్డి, వేములపల్లి సర్పంచ్ గుమ్మడవెల్లి రవి లను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వేములపల్లి గ్రామంలో తెలంగాణ కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దైద సాగర్ అధ్యక్షతన రాష్ట్ర నాయకులు జెల్ల పరశురాములు,తెలంగాణ కార్మిక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మారపు వెంకన్న,జిల్లా వైస్ ప్రెసిడెంట్ వెంకట్రాములు సమక్షంలో గ్రామ కార్మిక సమాఖ్య కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ అధ్యక్షుడు నవిల నర్సన్న,ఉపాధ్యక్షుడు కందుకూరి పుల్లయ్య,ప్రధాన కార్యదర్శిగా కొండా యశ్వంత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బార్పాటి రామనర్సు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాతలు ప్రాణ దాతలు

## - దర్దేపల్లి సర్పంచ్ రేణుక సురేష్

పాలకుర్తి జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్య) : రక్త దాతలు ప్రాణ దాతలని సర్పంచ్ ఘనపురం రేణుక సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని దర్దేపల్లి గ్రామంలో శ్రీ ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అధిగా పాల్గొని మాట్లాడుతూ శివాజీ యువసేన ఆధ్వర్యంలో రక్త దాన శిభిరం నిర్వహించడం అనేక మంది ప్రాణాలకు ప్రాణ దాతలుగా నిలిచారాని కోనియాడారు. కొంత మంది అపోహలతో రక్త దానం చేయడం లో బలహీనపడతారని భ్రమలో ఉంటారని అది సరియైన పద్ధతి కాదని వారు అన్నారు. మనం ఇచ్చే రక్త దానంతో ఒక నిండు ప్రాణం కాపాడబడుతుందని ప్రాణ దాతగా నిలవడంలో వున్నా తృప్తి వేల కట్టలేదని వారు అన్నారు. ఈ కార్యక్రమం జనగామ ప్రభుత్వ సెంటర్ హాస్పటల్ వైద్యాధికారి డాక్టర్ దివ్య సారధ్యం వహించగా ల్యాబ్ టెక్నిషియాన్ రాజు. నర్సింగ్ ఆఫీసర్ రషీద్. లతో పాటువార్డు సభ్యులు వీరన్న. రమేష్. అనిల్. శివాజీ యువసేన అధ్యక్షులు వేల్పుల వేణు. కార్యదర్శి ఘనపురం పరమేష్. జిట్టబోయిన అరవింద్. కోశాధికారి శేషు. సాయిరామ్. సందీప్. తదితరులు పాల్గొన్నారు.







## రాజకీయాల్లోకి అడుగుపెట్టిన రిటైర్డ్ ప్రొఫెసర్ డా,గద్ద వెంకటేశ్వర్లు



నర్సంపేట జనవరి 25, సూర్య ( మేజర్ న్యూస్) నర్సంపేట పట్టణం దళిత కుటుంబంలో జన్మించిన డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎం.ఏ., ఎం,ఫిల్. పి.హెచ్డీ పట్టాలు పొంది సామాజిక సేవ కలిగి ప్రజలను చైతన్యవంతం చేస్తూ, అభ్యుదయ భావాలు కలిగిన అలిశెట్టి ప్రభాకర్ జీవితం రచనలపై పరిశోధనలు చేసి డాక్టరేట్ పట్టా పొందారు. మూడు దశాబ్దాలకు పైగా అధ్యాపకులుగా, ప్రొఫెసర్ గా తనదైన శైలిలో పనిచేసి లక్షలాది మంది విద్యార్థులను తీర్చి దిద్దినఘనత వారికే దక్కుతుంది. వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పనిచేశారు. మన నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దశాబ్దకాలం పాటు పనిచేసి తనదైన శైలిలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. జాతీయ సేవా కార్యక్రమాలు నిర్వహింస్తూ, అనేక సభలు సమావేశాల్లో పాల్గొని విద్యార్థులను చైతన్యవంతం చేశారు. ప్రజలలో కొడిగట్టిన మూఢనమ్మకాలని రూపుమాపుటకు ఎన్నో కళ ప్రదర్శనలు నిర్వహించి ప్రజలను విద్యార్థులు తీర్చిదిద్దారు నిరు పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం పుస్తకాలు కొనివ్వడం వీరికి సర్వసాధారణం. ఉత్తమ అధ్యాపకుడిగా అనేక ప్రశంసలు సన్మానాలు పొందారు. ఇదంతా ఒక ఎత్తు అయితే రాజకీయాలు మరొక ఎత్తు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారులకి తీసుకురావడానికి చేస్తున్న కృషి అభినందనీయం. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక బి ఆర్ ఎస్ అయాంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన తెలంగాణ రాష్ట్రాన్ని, గాడిలో పెట్టి, పేద ప్రజలకు ఆరు గ్యారంటీలు, సన్న బియ్యం, రైతు భరోసా, వినూతన ఉచిత పథకాలు చేపట్టడం, నర్సంపేట నియోజకవర్గంలో ప్రియతమ నాయకులు, శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి చేస్తున్న అభివృద్ధి. నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. 15 ఆగస్టు,స్వాతంత్ర దినోత్సవం రోజున కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీలో అంకితభావంతో పనిచేస్తూ, మాధవరెడ్డి ఆశీస్సులతో 30 వ వార్డు క్రియాశీలక కార్యక్రమాలు చేస్తూ, అభివృద్ధికి తోడ్పడుతున్నారు. వార్డు ప్రజలకు నిస్వార్థంతో, నిబద్ధతతో, అందరికీ అందుబాటులో ఉంటూ పనిచేస్తున్నారు. జరిగే నర్సంపేట మున్సిపాలిటీ ఎన్నికలలో 30 వ వార్డు కౌన్సిలర్ గా బీఫామ్ ఆశిస్తున్నారు. అని వారు అన్నారు.

## విద్యార్థి దశ నుంచే ఓటుపై, ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలి






దేవరుప్పుల జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్య): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని దేవరుప్పుల తహశీల్దార్ మహమ్మద్ అశ్వక్ అహ్మద్ అన్నారు. ఆదివారం జాతీయ ఓటర్ల దినోత్సవం 2026 పురస్కరించుకుని మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది ప్రజా ప్రతినిధులు అధ్యాపక బృందం విద్యార్థులతో నిర్భయంగా, కుల, మత, వర్గాలకు అతీతంగా, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఎన్నికల్లో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. భారత ఎన్నికల సంఘం ఆవిర్భవించిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏటా ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2026 సంవత్సరానికి గాను ఓటు కంటే మిన్న ఏదీ లేదు, నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు తహశీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు విలువను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఓటుపై, ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని ఎటువంటి ఒత్తిడిలకు ప్రభావితం కాకుండా ఓటుహక్కు పొందగానే ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం రంగోలి పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ సుకన్య డిప్యూటీ తహసీల్దార్ అనిల్ బాబు డిప్యూటీ పిఆర్ఓ వేణు ఆర్ఐ రాజు జిపిఓ వెంకటేష్ జూనియర్ అసిస్టెంట్ నరేందర్ విఆర్ఓ శివ రికార్డ్ అసిస్టెంట్ యాకన్న అధ్యాపక బృందం రమ్య స్రవంతి గ్రామ ప్రజాప్రతినిధులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో ఎంతో ఆనందం



పెద్దవంగర; జనవరి 25; (సూర్య న్యూస్); క్రీడలు ఎంతో ఆనందాన్ని ఇస్తాయని పెద్దవంగర, చిట్యాల కాంప్లెక్స్ ఉపాధ్యాయులు అన్నారు. పెద్దవంగర కాంప్లెక్స్, చిట్యాల కాంప్లెక్స్ ఉపాధ్యాయుల మధ్య స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ లో చిట్యాల కాంప్లెక్స్ టీచర్స్ కెప్టెన్ చిక్కాల సతీష్ టీం విజయం సాధించగా, ఎంఈఓ బుధారపు శ్రీనివాస్ గెలిచిన చిట్యాల కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు షీల్డ్ ను బహుకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిక్కాల సతీష్ మాట్లాడుతూ క్రీడలు వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ ఎంతో ఆహ్లాదాన్ని ఆనందాన్ని ఇస్తాయని ప్రతి ఒక్కరూ క్రీడల ఉత్సాహాన్ని ఆస్వాదించాలని అన్నారు.

## నిలకడలేని ప్రజా ప్రతినిధి

- శుక్రవారం బిజెపి,శనివారం కాంగ్రెస్ పార్టీ
- ఆదివారం మళ్లీ బిజెపి పార్టీలోకి



బయ్యారం, మేజర్ న్యూస్ సూర్య,జనవరి 25. బయ్యారం మండలంలో నామలపాడు పంచాయతీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ఐదో వార్డు సభ్యులు చీమల కృష్ణ శుక్రవారం బిజెపి పార్టీ మండల కార్యదర్శులు ఊకే రాంమూర్తి, తుమ్మల శ్రీనివాస్ సమక్షంలో బీజేపీ చేరారు. శనివారం రోజున జారే సాగర్, ఎల్లబోయిన జంపన్న సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం మళ్లీ స్వంత పార్టీ బిజెపిలో చేరినట్లు బీజేపీ మండల కార్యదర్శులు, తుమ్మల శ్రీనివాస్,ఊకే రాంమూర్తి మీడియాకు తెలిపారు. మూడు రోజుల్లో రెండు పార్టీలలో చేరడంతో ఈ ప్రజా ప్రతినిధి కి నిలకడ లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు..రేపు మళ్ళీ ఏ పార్టీలో చేరుతాడో అని ఫన్నీ కామెంట్స్ చేస్తున్నారు.

## ఓటు హక్కు మన బాధ్యత దానిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి

- తహసిల్దార్ చందా నరేష్
- ఓటు హక్కు పై అవగాహన ర్యాలీ



నెల్లికుదురు జనవరి 25 మేజర్ న్యూస్( సూర్య) ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత దానిని మనం సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ చందనరేష్ అన్నారు. ఆదివారం 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక తహసిల్దార్ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ తీశారు. అనంతరం ప్రజాస్వామ్య వ్యవస్థకు దీర్ఘకాలంగా సేవలందిస్తున్న సీనియర్ సిటిజన్లోను సత్కరించి గౌరవించారు. తాసిల్దార్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యానికి పునాది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఐ గుంటుక యాకయ్య, ఆర్ ఐ రామకృష్ణ, ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్లు రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# కబ్జాదారుల నుంచి మా భూమిని కాపాడండి....!

- మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాల్"ను దర్జాగా కబ్జా.
- ఎంబి రికార్డు అయిన పిల్లర్లను కులగొట్టిన వ్యక్తి పై కఠిన చర్యలు తీసుకోవాలి
- అధికారులను వేడుకున్న కొత్తగూడెం గ్రామ మున్నూరుకాపు సంఘం సభ్యులు, గ్రామస్తులు



సంగెం,జనవరి 25( మేజర్ న్యూస్ సూర్య): మండలంలోని కొత్తగూడెం గ్రామనికి చెందిన మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాల్ పిల్లర్లను కులగొట్టి భూమిని అమ్ముకున్న వ్యక్తి పై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు వాసం బిక్షపతి గ్రామస్తులు డిమాండ్ చేశారు.వివరాలలోకి వెళితే.. వరంగల్ జిల్లా సంగెం మండలం కొత్తగూడెం గ్రామ పంచాయతీ 2009 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్ రావు చొరవతో గ్రామ మున్నూరుకాపు పెద్దలు అప్పటి గ్రామ సర్పంచ్ వాసం సురేష్ బాబు గ్రామ పార్టీ అధ్యక్షుడు వాసం సాంబయ్య కోరిక మేరకు ఎమ్మెల్యేని మెప్పించి మున్నూరుకాపు సంఘ కమ్యూనిటీ హాల్ ను సాంక్షన్ చేయించుకున్నామని తెలిపారు.ఈ కమ్యూనిటీ హాల్ ను సంగెం గ్రామానికి చెందిన కోదాటి సమ్మయ్య కాంట్రాక్టర్ గా వ్యవహరిస్తూ పిల్లర్లు లేపి బిల్లులు రాక ఆపివేయడం జరిగింధని మున్నూరు కాపు సభ్యులు అన్నారు.ఈ కమ్యూనిటీ హాల్ వెనుకల అదే గ్రామానికి చెందిన ననుమాస శ్రీనివాస్ భూమి ఉండగా..అదును చూసి శ్రీనివాస్ కుమారుడు శ్రీకాంత్ ఎవరికి తెలియకుండా సిరబొయిన కట్టయ్య కు రూ.రెండు లక్షలకు అమ్ముకున్నాడని మున్నూరు కాపు సంఘం సభ్యులు తెలిపారు.ఇప్పటికైన అధికారులు స్పందించి మున్నూరు కాపు సంఘం కమ్యునిటి హాల్ పై విచారణ చేసి కమ్యూనిటీ హాల్ ను కూల్చివేసిన వ్యక్తి జేసిబి పై తగిన చర్యలు తీసుకొని మా కమ్యూనిటీ హాల్ ను మాకు అప్పగించాలని ఆదివారం రోజున అధికారులను మున్నూరుకాపు సంఘం సభ్యులు గ్రామ ప్రజలు ఎనబోతుల సదయ్య(ఎల్లయ్య),పోశాల గణేష్, వాసం అఖిల్,సారంగపాని,డీలర్ సాంబయ్య, అశోక్,రమేష్,ఒర్సు నాగరాజు,పాల సారంగం, శంకరయ్య,వాసం మధు, కుమారస్వామి,వాసం నాగేశ్వర్ రావు,సురయ్య,బక్కి రమేష్,తదితరులు వేడుకున్నారు



# ముల్కనూర్ బాలికకు రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డు



భీమదేవరపల్లి, జనవరి 25(మేజర్ న్యూస్ సూర్య): భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన గొల్లెన శ్రీనిధి కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో గుర్తింపు సాధించింది. బాలల హక్కుల ప్రజా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డు ప్రధానోత్సవంలో ఆమెకు తెలంగాణ రాష్ట్ర సిల్వర్-గోల్డ్ అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డును వలస సుభాష్ చంద్రబోస్ తండ్రి వలస శంకరయ్య జ్ఞాపకార్థంగా అందజేయడం విశేషం. ఈ సందర్భంగా వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ చిన్నారులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ధారించుకుని నిరంతర శ్రమతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ కోచ్ సిరిగిరి సాంబశివ, శ్రీధర్, శ్రీనిధి, బాలమణి, తల్లిదండ్రులు పాల్గొని అభినందనలు తెలిపారు.

# మృతదేహానికి నివాళి

- దాసరి జాకిరయ్య కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్



కొడకండ్ల,జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్య) కొడకండ్ల,గ్రామానికి చెందిన దాసరి జాకిరయ్య ఆదివారం ఉదయం మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో పరామర్శించారు. మృతి కి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతిని తెలియచేశారు. కార్యక్రమ లో మాజీ సర్పంచ్ మధుసూదన, ఏఎంసీ డైరెక్టర్ బత్తుల వెంకన్న, నాయకులు ధర్మారపూ భిక్షపతి, అందే వెంకన్న, అందే అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కొడకండ్ల గురుకుల ప్రిన్సిపాల్ కు అరుదైన (గురురత్న) పురస్కారం



కొడకండ్ల, జనవరి 25మేజర్ న్యూస్ (సూర్య) : కొడకండ్ల గురుకుల ప్రిన్సిపాల్ ఆర్యవైశ్య ముద్దుబిడ్డ పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన తమ్మి దిలీప్ కు ప్రతిష్టాత్మకమైన అరుదైన గురురత్న అవార్డుకు ఎంపికయ్యారు. తెలుగు రాష్ట్రంలోని ఉత్తమ విద్యావంతులకు ఇచ్చే ఈ పురస్కారాన్ని తమిళనాడులోని (ఏ.మే.ట్) వర్సిటీ డాక్టర్ రామచంద్రన్ మరిటైమ్ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రకటించారు.ఆదివారం చెన్నైలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో తమ్మి.దిలీప్ ఈ అవార్డ్ అందుకున్నారు.

# గోర్శిక్వాడి గోర్సేన ఆధ్వర్యంలో ముగ్గురు సర్పంచ్ లకు ఘన సన్మానం



నర్సంపేట జనవరి 25 సూర్య (మేజర్ న్యూస్) నర్సంపేట పరిధిలో గోర్ శిక్వాడి గోర్ సేన సంఘం ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సంపేట మండలం ఇప్పల్ తండా గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్ బాణోత్ మైబూ నాయక్, రాజుపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ బాణోత్ అఖీల బాయి, దుగ్గొండి మండలం నారాయణ తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ అజ్మీరా నిర్మల (వంశి) లను గోర్ సేన నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోర్ శిక్వాడి గోర్ సేన నాయకులు మాట్లాడుతూ, ప్రజల విశ్వాసంతో ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, పేదల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనలో ముందుండాలని ఆకాంక్షించారు. గోర్ సేన ఎల్లప్పుడూ ప్రజాప్రతినిధులకు అండగా నిలుస్తుందని వారు తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో బోడా కిషన్ నాయక్, గోర్ సేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు బోడా బాబు నాయక్, మీడియా వింగ్ ఇంచార్జ్ భూక్య వెంకన్న నాయక్, బాణోత్ గోపీ నాయక్ తదితర గోర్ సేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సమ్మక్క-సారక్క జాతరలో 108 బైక్ అంబులెన్స్ సేవల చారిత్రాత్మక ప్రారంభం

- భక్తుల ప్రాణ రక్షణే లక్ష్యంగా ముందుకొచ్చిన 108 సేవలు
- ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్ చేతుల మీదుగా ప్రారంభం



నర్సంపేట జనవరి 25. సూర్య (మేజర్ న్యూస్) : తెలంగాణ కుంభమేళాగా ఖ్యాతిగాంచిన సమ్మక్క-సారక్క జాతరలో భక్తుల భద్రతకు పెద్దపీట వేస్తూ 108 బైక్ అంబులెన్స్ సేవలను ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్ ఘనంగా ప్రారంభించారు.లక్షలాది మంది భక్తులు తరలివచ్చే ఈ మహా జాతరలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే వైద్య సహాయం అందించాలనే లక్ష్యంతో ఈ సేవలను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.ఆపద సమయంలో ప్రథమ చికిత్స కోసం 108 అంబులెన్స్ సేవలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని భక్తులకు పాటి శివకుమార్ పిలుపునిచ్చారు.అదేవిధంగా ఆదివారం నాడు జాతర ప్రాంగణంలో మొత్తం 40 బైక్ అంబులెన్స్ సేవలను ప్రారంభించడం జరిగింది. రద్దీ ప్రాంతాలు, అటవీ మార్గాలు, కాలిబాటల వద్ద కూడా వేగంగా చేరుకునేలా ఈ బైక్ అంబులెన్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ తో పాటు 108 సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని, జాతరలో వైద్య సేవలకు సంపూర్ణ సహకారం అందించనున్నట్లు వెల్లడించారు.

# 'ప్రతి నెల-ఒక వార్డు'తో పరిశుభ్రతకు నాంది

## - సర్పంచ్ వినూత్న కార్యక్రమం!

భీమదేవరపల్లి, జనవరి 25(మేజర్ న్యూస్ సూర్య): భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ అన్నారు. గ్రామంలో ఆదివారం "ప్రతి నెల--ఒక వార్డు" పేరుతో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుద్ధ్యానికి శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇకపై ప్రతి నెల ఒక వార్డును ఎంపిక చేసి ఆ వార్డులో రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు శుభ్రం చేయడం, చెత్త తొలగింపు వంటి పనులను నిరంతరంగా చేపడతామని చెప్పారు. గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచుకోవడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని ఆమె పేర్కొన్నారు.



పంచాయతీతో పాటు గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. శుభ్రతతోనే ఆరోగ్యం, గ్రామాభివృద్ధి సాధ్యమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, యువతతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ



భీమదేవరపల్లి, జనవరి 25(మేజర్ న్యూస్ సూర్య): భీమదేవరపల్లి మండల కేంద్రంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేష్, సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఎలు గ్రామంలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామంలోని మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు తప్పనిసరిగా ఓటు వేయాలని ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సూర్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు శ్రీధర్, రాజు, రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఎలు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా క్యాలెండర్ ను ఆవిష్కరించిన గందె వెంకటేశ్వర్లు



పరకాల, జనవరి 25, మేజర్ న్యూస్ సూర్య, తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా క్యాలెండర్‌ను పరకాల ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డిలర్స్ వెల్ఫర్ అసోసియేషన్ అధ్యక్షులు గందె వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆదివారం పరకాల అరుణ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ షాప్ నందు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకోగా వారు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రైతు రక్షణ సమితి నిరంతరం కృషి చేస్తుందని, రైతుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలిపారు. రైతులకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చేపడుతూ, ప్రభుత్వానికి రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు ప్రకాష్, మల్లారెడ్డి, దయాకర్, కుమారస్వామి, గౌతమ్ పాల్గొన్నారు.

# చిన్నారికి సర్పంచ్ కొండ రాజమ్మ ఆశీర్వాదం



మల్హర్, జనవరి 25 మేజర్ న్యూస్ సూర్య : మండలంలోని కొయ్యూర్ గ్రామ మాజీ వార్డు సభ్యులు యూత్ కాంగ్రెస్ నాయకులు గొట్టం లక్ష్మినారాయణ - రాణి దంపతుల కుమార్తె అయిన చిన్నారికి కొయ్యూరు లక్ష్మి దేవర సన్నిధిలో తలనీలాలు సమర్పణ కార్యక్రమంలో కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ పాల్గొని చిన్నారికి నూతన వస్త్రాలు బహుకరించి ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి చేద లక్ష్మయ్య, కాంగ్రెస్ మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి తెప్పల రజిత, నాయకులు వేల్పుల వెంకటేష్, అరవెండి మహేందర్, బీస్కుల అశోక్, ఉజ్జ నాయక్, వేల్పుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కరు అడిగారు..250 మంది స్పందించారు

## - రోడ్డు ప్రమాదంలో బాధితుడికి రూ 1.93 లక్షల సాయం

## - అండగా నిలిచిన పాత్రికేయుడికి అభినందనలు





నెక్కొండ జనవరి 25 మేజర్ న్యూస్(సూర్య): సామాజిక బాధ్యత కలిగిన వర్గాల్లో ఒకటిగా పేరొందిన పాత్రికేయ వృత్తిలో ఉంటూ కష్టాల్లో ఉన్నవారికి తోడ్పాటును అందించాలనే సంకల్పంతో తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడితే అండగా నిలిచి వివిధ వర్గాల సహకారంతో ఆర్థిక సహాయం అందించి శభాష్ అనిపించుకున్నారు నెక్కొండ మండలం గుండ్రపల్లి కి చెందిన కాడబోయిన రాజ్ కుమార్. పాత్రికేయులు శోధిస్తారు, వేధిస్తారు, తమ అవసరాల కోసం ఎదుటివారి చేతి చమూరు విదిలిస్తారు అనే విమర్శలు ఎక్కువవుతున్న క్రమంలో స్పందిస్తారు, చేయూతనిస్తారు, నలుగురుని కలుపుకొని అయినా ఆపదలో ఉన్న తోటి వారికి అండగా నిలుస్తారని అనుకునేలా ముందుకు సాగి అతడు సఫలీకృతులయ్యాడు. నెక్కొండ మండలం గుండ్రపల్లికి చెందిన సోహెల్ గత నెలలో మేడారం సమ్మక్క సారలమ్మ దర్శనానికి వెళుతూ గోవిందరావుపేట నవీపంలో రోడ్డు ప్రమాదానికి గురై ఒక కాలును కోల్పోయాడు, రెండవ కాలుకు చికిత్స కూడా కొనసాగుతోంది. మంచానికే పరిమితమైన దయనీయ స్థితిలో ఆసుపత్రి ఖర్చులకు పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం ఉండడంతో తమ గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి తమకు తోచిన సహాయం చేయాలని నెక్కొండ పౌరులు నెక్కొండ మండల వాణి ఉండపల్లి పౌరులు వాట్సాప్ గ్రూప్ లలో రాజ్ కుమార్ అభ్యర్థించాడు. ఈ అబ్బాయి తనకు మొదట్లో ఒకరిద్దరితో మొదలైన స్పందన కాస్త పదులు, వందల సంఖ్యకు చేరింది. కొన్ని రోజులలో ఈ మూడు వాట్సాప్ గ్రూప్ లలో కలిపి 250 మంది తమకు తోచినంత రాజకుమార్ పేరిట గూగుల్ పే, ఫోన్ పే చేశారు. ఇలా ప్రోగయిన 1.93 లక్షల ఆర్థిక సహాయాన్ని గ్రామ సర్పంచ్ బోళ్ల యాదలక్ష్మి శివకుమార్,రిపోర్టర్ కాడబోయిన రాజ్ కుమార్ తోపాటు పలువురు వార్డు మెంబర్లు, దాతల సమక్షంలో సోహెల్ కుటుంబ సభ్యులకు అందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోళ్ళ యాదలక్ష్మీ శివకుమార్, వార్డు సభ్యులు జక్క భాగ్యలక్ష్మి, సూత్రపు సుధాకర్, షేఖ్ ఇస్మాయిల్, బొంత స్వప్న రామచంద్రు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాటిపర్తి నాగేంద్రమ్మ, బోళ్ళ వీరస్వామి, తక్కలపల్లి భుజంగరావు, దొంగల వేణు, తాటీపర్తి అంజన్ రెడ్డి, బోళ్ళ శ్రీను, భైరు ఎల్లయ్య, పెరం పెద్దకృష్ణ రావు, నన్నేసయాబ్, తదితరులు పాల్గొన్నారు.

# పల్లె విద్యార్థులు పార్లమెంట్ లో

## - ఉభయ సభలను వీక్షించిన సిద్దార్ధ విద్యార్థులు



పాలకుర్తి జనవరి 25 మేజర్ న్యూస్ (సూర్) పల్లెటూళ్ల విద్యార్థులను పార్లమెంట్ ఉభయ సభలను విక్షించే సువర్ణ అవకాశం కల్పించి అత్యున్నత స్థాయికి పిల్లల మైండ్ సేట్ తీసుకెళ్లాడానికి దోహదపడుతుందని ఆశభావం వ్యక్తం చేశారు సిద్దార్ధ విద్యాలయ ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్. తమ విద్యాలయం పిల్లలను విజ్ఞాన విహార యాత్ర లో భంగంగా ఢిల్లీ లో ప్రతిష్టత్మకమైన ప్రదేశాలతో పాటు ఉభయ సభలను చూపించే అరుదైన అవకాశం మాకు దక్కటం గొప్ప అనుభూతితో పాటు పిల్లలు మానసిక స్థాయిలను పెంచే అవకాశం దొరికినందుకు హర్షం వ్యక్తం చేశారు పాఠశాల కరస్పడెంట్ జక్కుల ఊర్మిళ. ఈ కార్యక్రమంలో శంతన్. ఉపాధ్యాయులు గూడా మహేష్. శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్స్ డే సందర్భంగా ముగ్గుల పోటీ



తరిగొప్పుల జనవరి 25 మేజర్ న్యూస్ సూర్య తరిగొప్పుల మండలంలోని కొత్తదండ గ్రామపంచాయతీలో 16వ నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో మొదటి బహుమతిగా భూక్య నికిత రెండవ ప్రైజ్ గా ఇస్లావత్ వైష్ణవి ని నిర్ణయించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపసర్పంచ్ భూక్య మాన్సింగ్ వార్డు సభ్యులు సునీత మనీ అంగన్వాడి టీచర్ వనిత బుక్య స్వరూప రాములు గుగులోతు రవి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.